
సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
మంగళవారం, 09.06.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 218
పేజీలు: 08 వెల: రూ. 5

# మోడీ కీలక సమావేశం

## ఢిల్లీకి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్

- మోదీ 12 ఏళ్ల పాలనకు అభినందన తీర్మానం ప్రతిపాదించనున్న చంద్రబాబు
- కేంద్ర క్యాబినెట్ విస్తరణపై చర్చలు జరగనున్నాయనే ఊహాగానాలు
- వికసిత్ భారత్ 2047 లక్ష్యాలపై రాష్ట్రాలకు మోదీ దిశానిర్దేశం
- ఏపీ ప్రయోజనాలపై దృష్టి




02



# కాంగ్రెస్ కేబినెట్ కసరత్తు!

## త్వరలో క్లారిటీ

కర్ణాటక అధ్యాయం ముగియగానే తెలంగాణ కాంగ్రెస్ పై హైకమాండ్ దృష్టి

- మంత్రి పదవుల కోసం ఢిల్లీలో ఆశావహ నేతల లాబీయింగ్
- రాహుల్ గాంధీని కలిసిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- ఖాళీల భర్తీతో పాటు శాఖల మార్పులపైనా చర్చలు
- సీనియార్టీ, సామాజిక సమీకరణాల మధ్య కాంగ్రెస్‌కు కఠిన సవాల్
- ఒకరికి తృప్తి.. మరొకరికి అసంతృప్తి తప్పదా?
- మంత్రివర్గ ప్రక్షాళన తేనెతుట్టెను కదిలించినట్లేనా
- కర్ణాటక అసంతృప్తి ప్రభావంతో తెలంగాణలో అధిష్ఠానం అప్రమత్తం
- కేబినెట్ మార్పులు కాంగ్రెస్‌కు జోష్ తెస్తాయా?
- కొత్త వివాదాలకు దారి తీస్తాయా?

**ముద్ర డెస్క్ :** కర్ణాటక కాంగ్రెస్‌లో నెలల తరబడి కొనసాగిన రాజకీయ అనిశ్చితికి అధిష్ఠానం తెరదించడంతో ఇప్పుడు తెలంగాణపై దృష్టి కేంద్రీకరించినట్లు స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. కర్ణాటకలో ముఖ్యమంత్రిమార్పు ప్రక్రియను పూర్తి చేసిన తర్వాత, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న తెలంగాణ మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణ అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు ప్రారంభించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జోరందుకుంది. దీంతో రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్న నేతలు ఢిల్లీ బాట పట్టగా, పార్టీ అగ్రనేతలతో వరుస భేటీలు నిర్వహిస్తూ తమవంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రస్తుతం తెలంగాణ కేబినెట్‌లో ఆరు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నరేళ్లు కావస్తున్నా విస్తరణ జరగకపోవడంతో ఆశావహుల్లో అసహనం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో త్వరలోనే మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ వచ్చే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం ఊపందుకుంది. అయితే కేవలం ఖాళీల భర్తీకే పరిమితం కాకుండా శాఖల మార్పులు, కొంత మంది మంత్రుల పనితీరుపై సమీక్ష, ప్రాంతీయ–సామాజిక సమతుల్యత వంటి అంశాలు కూడా పరిశీలనలో ఉన్నాయని చెబుతున్నాయి. మంత్రి పదవుల రేసులో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచే కేబినెట్ బెర్త్‌పై ఆశలు పెట్టుకున్న ఆయనకు అప్పట్లో అవకాశం దక్కలేదు. దీంతో ఈసారి ఎలాగైనా మంత్రివర్గంలో చోటు సంపాదించుకోవాలనే లక్ష్యంతో ఢిల్లీలో ముమ్మరంగా లాబీయింగ్ చేస్తున్నారు. ఇటీవల ఆయన రాహుల్ గాంధీని కలిసి తన వాదన వినిపించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఆయనతో పాటు పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు కూడా ఢిల్లీలో హైకమాండ్ పెద్ద లను కలుస్తూ తమ అవకాశాలను మెరుగుపర్చుకునే ప్రయత్నాల్లో ఉన్నారు.

అయితే తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ విస్తరణ అనేది సాధారణ పరిపాలనా ప్రక్రియ కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రతి వర్గం, ప్రతి ప్రాంతం, ప్రతి సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాల్సిన పరిస్థితి ఉంది. ఒకరికి మంత్రి పదవి ఇస్తే మరొకరు అసంతృప్తికి గురయ్యే అవకాశం ఉండటంతో అధిష్ఠానం అడుగడుగునా అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఎన్నికల సమయంలో పార్టీ మిగతా 02లో

# ఇన్సూరెన్స్ కోసం హత్య

రూ.50 లక్షల పాలసీ డబ్బు కోసం హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరణ



- పోలీసుల దర్యాప్తులో బయటపడిన అసలు నిజం
- మద్యం తాగించి హత్య.. ఉస్మానియా ఆస్పత్రి వరకు తీసుకెళ్లి నాటకం
- మక్తల్ పోలీసుల చాకచక్యం.. హత్య కేసు ఛేదన

03

# మృగశిర కార్తె

## చేపల మార్కెట్లు కిటకిట



- తొలి రోజున చేప కూర తింటే ఏడాదంతా ఆరోగ్యం
- ప్రజల్లో అనాదిగా వస్తున్న నమ్మకం
- ధరలు పెంచి అమ్మిన వ్యాపారులు

02

# మరో మెగా రైల్వే కారిడార్

- 200 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్
- సింగరేణి బొగ్గు రవాణాలో విప్లవాత్మక మార్పులు
- భద్రాచలం–రామగుండం మధ్య ప్రత్యక్ష రైలు అనుసంధానం
- తెలంగాణకు మరో మెగా మౌలిక వసతుల ప్రాజెక్టు

## తెలంగాణలో రూ.5 వేల కోట్లతో కొత్త రైల్వే లైన్ రామగుండం–మణుగూరు మధ్య ఏర్పాటు










**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో పారిశ్రామిక ప్రగతికి, రవాణా రంగానికి ఊతమిచ్చేలా రామగుండం–మణుగూరు నూతన రైల్వే కారిడార్ త్వరలోనే పట్టాలెక్కనుంది. రాష్ట్రంలో ప్రధాన ఆర్థిక హబ్‌గా ఎదిగేందుకు అన్ని అర్హతలున్న ఈ ప్రతిపాదిత రైల్వే లైన్.. సుమారు 200 కిలోమీటర్ల మేర విస్తరించనుంది. రూ.5 వేల కోట్ల భారీ అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రాజెక్టు ద్వారా అటు సరుకు రవాణా, ఇటు ప్రయాణికుల కనెక్టివిటీ రంగాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. ఈ నూతన రైల్వే లైన్ ప్రారంభమైన తొలి రోజుల్లోనే ఏటా దాదాపు రూ. 460 కోట్ల ఆదాయాన్ని ఆర్జించొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆపరేషన్ ప్రారంభించిన ఐదేళ్ల వ్యవధిలో.. బొగ్గు, కోక్, ఆహార ధాన్యాలు, సిమెంట్, ఖనిజాలు, ఇతర లోహాల రవాణా ద్వారా ఏటా దాదాపు 12 మిలియన్ టన్నుల సరుకు రవాణా జరుగుతుందని దీని ద్వారా వార్షిక రాబడి ఏకంగా రూ.720 కోట్లకు చేరుతుందని రైల్వే నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. సరుకు రవాణాతో పాటు, దేశంలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణికుల కనెక్టివిటీని మెరుగుపరచడంలో ఈ కారిడార్ కీలక పాత్ర పోషిస్తుంది. ఢిల్లీ–చెన్నై హై–డెన్సిటీ రూట్‌లో రామగుండం వ్యూహాత్మకంగా ఉండటం ఈ ప్రాంత ఆర్థిక పురోగతికి మరింత ప్లస్ పాయింట్ కానుంది. ఈ లైన్ ద్వారా రామగుండం, భద్రాచలం ప్రాంతాల్లోని బొగ్గు గనుల బెల్టుల మధ్య ప్రత్యక్ష రైలు మార్గం ఏర్పడనుంది. ప్రస్తుతం కొత్తగూడెం నుండి రామగుండానికి బొగ్గు రవాణా చేయాలంటే అత్యంత రద్దీగా ఉండే డోర్నకల్–వరంగల్–రామగుండం సెక్షన్ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. ఇది న్యూఢిల్లీ–చెన్నై హై–డెన్సిటీ కారిడార్‌లో భాగం కావడంతో ఆలస్యం అవుతోంది. మిగతా 02లో

# ప్రపంచ స్థాయి నగరంగా మారుస్తాం

## సీఎం రేవంత్ రెడ్డి

02



- హైదరాబాద్ అభివృద్ధి కోసం మూడు కార్పొరేషన్లుగా విభజించాం
- రాజులరామారంలో 100 ఎకరాల్లో అంతర్జాతీయ బస్ టెర్మినల్ నిర్మాణానికి ప్రణాళిక
- మెట్రో రెండో దశ విస్తరణతో పాటు లక్ష ఎల్ఐజీ, ఎంఐజీ ఇళ్ల నిర్మాణం
- వచ్చే 24 నెలలు పూర్తిగా అభివృద్ధికే అంకితమని స్పష్టం

# అంబేద్కర్ ఆశయాలకు జ్ఞానసౌధాలు

02

## డిప్యూటీ సీఎం భట్టి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి

- తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక అడుగులు
- లోయర్ ట్యాంక్‌బండ్‌లో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్
- నింబోలీఅడ్డాలో బాబు జగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహం



# ప్రభుత్వ భూములను కాజేసేవారిపై ఉక్కుపాదం

## అక్రమ సేల్ డీడ్‌ల రద్దుకు మంత్రి పొంగులేటి ఆదేశం

- బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ అధికారులే భూదందాలకు పాల్పడ్డారు
- ఇందిరమ్మ ఇళ్ల స్థలపరిశీలనలో వెలుగు చూసిన భూదందా
- హౌసింగ్ బోర్డు భూములను కాజేసిన డిప్యూటీ కలెక్టర్ రామునాయక్ సస్పెన్షన్
- సహకరించిన ఉద్యోగుల్లో ఒకరు డిస్మిస్, మరొకరు సస్పెన్షన్
- ఉద్యోగం నుంచి శాశ్వత తొలగింపునకు చర్యలు
- 2016 నుంచి రామునాయక్ భూదందాలపై దర్యాప్తు

02



# విశాఖ స్టీల్ ప్లాంటులో ఘోర ప్రమాదం


02

## హాట్ మెటల్ బకెట్ కూలి 9 మంది మృతి



- 1500 డిగ్రీల మెటల్ పేలుడుతో ఘోర ప్రమాదం
- స్టీల్ ప్లాంట్‌లో భారీ మంటలు, సహాయక చర్యలు
- కార్మికులు చిక్కుకున్నట్లు సమాచారం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- వైజాగ్ బయలుదేరిన కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మ

ఇదీ AI ముద్ర



వానాకాలం జాగ్రత్తలు : దోమల నివారణ



వర్షాల వల్ల నిల్వ ఉండే నీటిలో దోమలు చేరి మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి మరియు రాత్రి పూట దోమతెరలు లేదా మస్కిటో రిపెల్లెంట్స్ వాడాలి.

# మృగశిర కార్తె

**ముద్ర డెస్క్:**
మృగశిర అనగానే గుర్తొచ్చేది చేపలు. ఈ కార్తి మొదటి రోజు చేపలు తినడం అనవాయితీగా వస్తోంది. కార్తి రోజున చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని పెద్దలు చెబుతుంటారు. ప్రధానంగా ఉబ్బసం, ఆయాసం ఉన్నవారికి చేపలు ఎంతో మంచిది. దీంతో చేపల మార్కెట్లలో రద్దీ పెరిగింది. హైదరాబాద్ సహా జిల్లాల్లోని చేపల మార్కెట్లన్నీ ప్రజలతో కిక్కిరిసిపో యాయి. చేపల మార్కెట్ లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నది. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపలకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది.

మృగశిర కార్తె రోజున చేపలు తినడం వల్ల ఆస్తమా, శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. ఇందులో ఉండే ఒమేగా-3 గుండె, మెదడు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.మృగశిర కార్తె సందర్భంగా ఈ రోజు చేపల మార్కెట్లు జనాలతో కిటకిటలాడుతున్నాయి. ఈ పండుగ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు సాంప్రదాయకంగా ఇళ్లలో చేపల వంటకాలు చేసుకుంటారు. మృగశిర కార్తె రోజున చేపలు తినడం వెనుక శాస్త్రీయ, ఆరోగ్యపరమైన కారణాలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభంలో వచ్చే ఈ సమయంలో చేపలను ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే ప్రధాన ఉపయోగాలు ఇక్కడ ఉన్నాయి:శ్వాసకోశ సమస్యలకు విరుగుడు (ఆస్తమా నివారణ) గా ఉంటుంది.

మృగశిర కార్తె సమయంలో వేసవి వేడి తగ్గి.. వర్షాల కారణంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడుతుంది. ఈ మార్పుల వల్ల చాలా మందిలో ఉబ్బసం (ఆస్తమా), దగ్గు, ఆయాసం వంటి శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయి. చేపల్లో ఉండే ప్రత్యేక పోషకాలు, గుణాలు గుండె, ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరుస్తాయి.

# హైదరాబాద్‌లో రగ్బీ ప్రీమియర్ లీగ్‌కు సన్నాహాలు పూర్తి

## గచ్చిబౌలి స్టేడియంలో జూన్ 16 నుంచి ఆర్‌పీఎల్ సీజన్-2 ప్రారంభం

**ముద్ర, హైదరాబాద్:**
దేశంలో రగ్బీ క్రీడ అభివృద్ధికి కీలక వేదికగా నిలుస్తున్న రగ్బీ ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) సీజన్-2 జూన్ 16 నుంచి హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి అథ్లెటిక్ స్టేడియం, గచ్చిబౌలిలో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో లీగ్ నిర్వాహకులు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని ఆయన నివాసంలో కలిసి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి ఆర్‌పీఎల్ అధికారిక జెర్సీని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉందని, రాష్ట్రంలో వివిధ క్రీడా విభాగాలకు చెందిన జాతీయ, అంతర్జాతీయ స్థాయి లీగ్ పోటీల నిర్వహణకు సంపూర్ణ సహకారం అందిస్తోందని తెలిపారు.

జీఎంఆర్ స్పోర్ట్స్, రగ్బీ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ లీగ్ రెండో సీజన్‌లో మొత్తం 10 జట్లు పోటీపడనున్నాయి. వీటిలో ఆరు పురుషుల ఫ్రాంచైజీలు, నాలుగు మహిళల జట్లు ఉన్నాయి. మొత్తం 48 మ్యాచ్‌లు నిర్వహించనుండగా, 19 దేశాలకు చెందిన 70 మందికి పైగా అంతర్జాతీయ రగ్బీ సెవెన్స్ క్రీడాకారులు పాల్గొననున్నారు. భారతదేశానికి చెందిన అగ్రశ్రేణి రగ్బీ ప్రతిభావంతులు కూడా ఈ పోటీల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు.

భారతదేశంలో ఫ్రాంచైజీ ఆధారిత రగ్బీ పోటీల్లో ఆర్‌పీఎల్ ప్రధాన వేదికగా మారిందని నిర్వాహకులు తెలిపారు. ఈ లీగ్ ద్వారా రగ్బీ క్రీడకు మరింత ఆదరణ లభించడంతో పాటు దేశ ఒలింపిక్ లక్ష్యాలకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ డాక్టర్ సోనీ బాలా దేవి, రగ్బీ ఇండియా అధ్యక్షుడు రాహుల్ బోస్, జీఎంఆర్ స్పోర్ట్స్ ప్రతినిధి సుజోయ్ గంగూలీ, స్పోర్ట్స్ అథారిటీ



# ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



**ముద్ర, హైదరాబాద్ :**
మియాపూర్‌లో నిర్వహించిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. వేగంగా విస్తరిస్తున్న నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లు గా విభజించినట్లు తెలిపారు. మెట్రో రెండో దశ విస్త రణ, గాజులరామారంలో 100 ఎకరాల్లో అంతర్జాతీయ బస్ టెర్మినల్ నిర్మాణం, లక్ష LIG–MIG ఇళ్ల నిర్మాణం వంటి కీలక ప్రాజెక్టులను చేపడుతున్నామని వెల్లడించారు.

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నుంచి తగిన నిధులు రాకపోవడంపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. రా ష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు ప్రధాని వద్ద నిధులు ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. మూసీ నది అభివృద్ధి వంటి ప్రాజెక్టులకు అడ్డంకులు సృష్టించవద్దని సూచించారు. వచ్చే 24 నెలలు పూర్తిగా అభి వృద్ధి కార్యక్రమాలపైనే దృష్టి సారిస్తామని, రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర అభివృద్ధికి అందరూ స హకరించాలని సీఎం పిలుపునిచ్చారు.

# అంబేద్కర్ ఆశయాలకు జ్ఞానసౌధాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
సామాజిక న్యాయం, విద్యా సమానత్వం, అంబేద్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో నిర్మించనున్న అంబేద్కర్ నాలెడ్జ్ టవర్, నింబోలీఅడ్డాలో ఆధునికీకరించనున్న బాబు జగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహం విద్యా రంగంలో కీలక మైలురాళ్లుగా నిలుస్తాయని పేర్కొన్నారు. అంబేద్కర్ నాలెడ్జ్ టవర్‌ను సుమారు రూ. 110 కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వం, ఇందులో డిజిటల్ లైబ్రరీలు, ఈ-లెర్నింగ్ కేంద్రాలు, పరిశోధన విభాగాలు, పోటీ పరీక్షల శిక్షణా కేంద్రాలు, కెరీర్ గైడెన్స్ యూనిట్లు ఏర్పాటు చేయనుంది.

రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేసి, గ్రామీణ విద్యార్థులకు కూడా నాణ్యమైన శిక్షణ అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది.అదే విధంగా,



నింబోలీఅడ్డాలోని చారిత్రాత్మక బాబు జగ్జీవన్ రామ్ విద్యార్థి వసతి గృహాన్ని రూ.25 కోట్లతో అత్యాధునిక వసతులతో పునర్నిర్మించనున్నారు. ఈ రెండు ప్రాజెక్టులు కేవలం భవనాలు మాత్రమే కాకుండా, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యా అభ్యున్నతి, సామాజిక సాధికారతకు ప్రతీకలుగా నిలుస్తాయని భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని, యువతకు ఉన్నత అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, ఆర్ అండ్ బి సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఈ నర్సింగరావు, ఈఈ మనోహర్, ఆర్డీవో సాయిరాం, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను కాజేసేవారిపై ఉక్కుపాదం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లు, భూ దందాలకు పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులే వాటిని కొల్లగొట్టేందుకు ప్రయత్నించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న రాము నాయక్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. 2013 నుంచి 2018 వరకు హౌసింగ్ బోర్డులో ల్యాండ్ అక్విజిషన్ ఆఫీసర్‌గా పనిచేసిన సమయంలో ఆయన పలు భూ అక్రమాలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. హైదరాబాద్‌లోని హైకోర్టు సమీపంలో తెలంగాణ హౌసింగ్ బోర్డుకు చెందిన విలువైన 33.53 చదరపు గజాల భూమిని 2018లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించిన విషయం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ఈ వ్యవహారంపై లోతైన విచారణ చేపట్టగా మరిన్ని భూ దందాలు బయటపడినట్లు మంత్రి వెల్లడించారు. విజయనగర్ కాలనీ, తుల్జాగూడ, లక్ష్మి గూడ, మహబూబ్‌గంజ్ ప్రాంతాల్లోని పలు ప్రభుత్వ స్థలాలను ఇతరుల పేర్లపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు గుర్తించామని చెప్పారు. ఈ కేసుల్లో సంబంధిత సబ్ రిజిస్ట్రార్ల పాత్రపైనా విచారణ కొనసాగుతోందన్నారు.రాము నాయక్‌కు సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. సూపరింటెండెంట్ వివేకానంద్‌ను శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించగా, మరో సూపరింటెండెంట్ బోనా నాయక్‌ను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం అన్ని ఆధారాలు నిర్ధారణ అయితే రాము నాయక్‌ను కూడా శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు.

ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు, నకిలీ పత్రాలు సృష్టించేందుకు లేదా అధికార దుర్వినియోగానికి పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంతటి హోదాలో ఉన్నా చట్టం ముందు అందరూ సమానమేనని, ప్రజల ఆస్తులను దోచుకునే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించబోమని మంత్రి హెచ్చరించారు.



# మోడీ కీలక సమావేశం..

**ముద్ర, ఢిల్లీ :**
జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యత కలిగిన ఎన్డీయే ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమావేశం జూన్ 10న ఢిల్లీలో జరగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన అశోకా హోటల్‌లో నిర్వహించే ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరుకానున్నారు.


ప్రధానిగా మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన నాయకత్వాన్ని అభినందిస్తూ ప్రత్యేక తీర్మానాన్ని చంద్రబాబు ప్రతిపాదించనున్నారు. అలాగే కేంద్ర మంత్రివర్గ విస్తరణ, ఎన్డీయే భాగస్వామ్య పక్షాల పాత్ర, రాష్ట్రాలకు కేంద్ర సహకారం అంశాలపై చర్చ అవకాశం ఉంది. అదేవిధంగా 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో కేంద్ర-రాష్ట్రాల సమన్వయం, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల అభివృద్ధి అంశాలపై ప్రధాని మోదీ ముఖ్యమంత్రులకు దిశానిర్దేశం చేయనున్నారు. కేంద్రంతో సమన్వయం పెంచుకుని రాష్ట్ర ప్రయోజనాలను సాధించడంపై చంద్రబాబు, పవన్ ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# కాంగ్రెస్ కేబినెట్ కసరత్తు!

(మొదటి పేజీ తరువాయి)
కోసం కష్టపడ్డామని భావిస్తున్న నేతలు తమకు అవకాశం రాక పోతే బహిరంగ అసంతృప్తి వ్యక్తం చేసే అవకాశాలు లేకపోలేదు. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అనంతరం అక్కడ బయటపడిన అసంతృప్తి, అంతర్గత విభేదాలు కాంగ్రెస్ అధిష్ఠానానికి గుణపాఠంగా మారాయి. పైకి సమస్య పరిష్కారమైనట్లు కనిపించినా, అక్కడి నాయకత్వ సమీకరణాలు ఇప్పటికీ పూర్తిగా సద్దుమణగలేదు. ఇదే పరిస్థితి తెలంగాణలో తలెత్తకుండా ముందుగానే అన్ని వర్గాలను సంతృప్తిపరిచేలా నిర్ణయాలు తీసుకోవాలన్న ఆలోచనలో హైకమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది.

మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఇది కీలక పరీక్షగా మారింది. ఒకవైపు పార్టీ ఆశావహుల అంచనాలు, మరోవైపు ప్రభుత్వ స్థిరత్వం, ఇంకోవైపు సామాజిక-రాజకీయ సమీకరణాలను సమన్వయం చేయాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. మంత్రివర్గ విస్తరణతో కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం నింపగలిగితే అది ప్రభుత్వానికి బలంగా మారుతుంది. అదే అసంతృప్తి చెలరేగితే మాత్రం అధికార పార్టీకి అనవసర తలనొప్పులు తప్పవు.

# మరో మెగా రైల్వే కారిడార్




(మొదటి పేజీ తరువాయి)
ప్రస్తుతం ఉన్న ఈ పాత రూట్ కంటే కొత్తగా ప్రతిపాదించిన 207 కిలోమీటర్ల రామగుండం–మనుగూరు బొగ్గు కారిడార్ ఏకంగా 150 కిలోమీటర్ల దూరాన్ని తగ్గిస్తుంది. ఈ షార్ట్ రూట్ వల్ల రవాణా సమయం కలిసిరావడమే కాకుండా నిర్వహణ సామర్థ్యం పెరిగి లాజిస్టిక్స్ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ ఇప్పటికే పూర్తయి కేంద్ర ప్రభుత్వ తుది ఆమోదం కోసం వేచి ఉంది. భూసేకరణకు పట్టే ఒక ఏడాదితో కలిపి, మొత్తం ఐదేళ్ల వ్యవధిలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి న్యూఢిల్లీ వైపు వెళ్లే పలు రైళ్లు భద్రాద్రి కొత్తగూడెం మీదుగా ప్రయాణించేందుకు మార్గం సుగమం అవుతుంది. ఇది ప్రాంతీయ కనెక్టివిటీని మార్చడమే కాకుండా ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుంది.

# గొడ్డలి పార్టీకేంతెలుసు రైతుల బాధలు

## పశ్చిమగోదావరి జిల్లా సిద్ధాంతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**ముద్ర, అమరావతి:**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ నియోజకవర్గంలోని సిద్ధాంతంలో నిర్వహించిన 'మీ భూమి.. మీ హక్కు' కార్యక్రమంలో రైతులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వస్తున్నాయని, వాటి ద్వారా సుమారు 22 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని చంద్రబాబు తెలిపారు. భూముల రీసర్వేను బ్లాక్‌చైన్ టెక్నాలజీ ఆధారంగా నిర్వహించామని, ఎలాంటి అక్రమాలు జరిగినా వెంటనే గుర్తించే విధంగా వ్యవస్థను రూపొందించామని చెప్పారు. ఇప్పటివరకు 6,688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి, 26.46 లక్షల మందికి పట్టాదారు పాసు పుస్తకాలు అందించామని వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రతిపక్షంపై విమర్శలు చేసిన సీఎం, "గొడ్డలి పట్టుకునే చేతులకు నాగలి పట్టే రైతుల బాధలు అర్థం కావు. కోడికత్తి డ్రామాలు ఆడేవారికి వరి కోతల కష్టాలు తెలియవు" అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల విశ్వాసాలను దెబ్బతీసే చర్యలకు పాల్పడిన వారిని దేవుడే శిక్షిస్తాడని చంద్రబాబు అన్నారు.



# స్టీల్ ప్లాంటులో ప్రమాదం

**ముద్ర, విశాఖపట్నం :**
విశాఖ స్టీల్ ప్లాంటులో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో స్టీల్ లిక్విడ్ పడి తొమ్మిది మంది కార్మికులు మృతిచెందారు. సోమవారం సాయంత్ర సమయంలో ఈ ఘెర ప్రమాదం సంభవించింది. ప్రధానంగా ప్లాంట్ ఎస్ఎంఎస్ -2లో హాట్‌మెంట్ బకెట్లు కూలి ఈ దుర్ఘటన జరిగింది. దీంతో పలువురు ప్రాణాలు కోల్పోగా, మరికొంత మంది తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో మరికొందరు కార్మికులు లోపల చిక్కుకున్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్లాంట్ లోపల భారీగా మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు ఆర్పే యత్నం చేస్తున్నారు. కాగా ప్రమాదానికి కారణం మెటల్ లిక్విడ్ పేలడం అని తెలుస్తోంది. 1500 డిగ్రీల వేడితో వెళుతున్న మెటల్ లిక్విడ్ పేలడం వల్ల ప్రమాదం జరిగినట్లు సమాచారం.ఈ ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది. గతంలోనూ పలుమార్లు స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదాలు జరిగాయి. గతేడాది స్టీల్ మెల్టింగ్ మిషన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో హైడ్రాలిక్ ఆయిల్ లీకై మంటలు చెలరేగాయి. ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని మంటలను అదుపుచేయడంతో పెనుప్రమాదం తప్పింది. వైజాగ్ బయలుదేరిన కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మ . ప్రమాదానికి గల సాంకేతిక కారణాలపై పూర్తిస్థాయి సమీక్ష చేస్తామ ని కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు ప్రకటించారు.

# ఎన్‌ఫోర్స్‌మెంట్ బలోపేతం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల వారీగా 10 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, రాష్ట్ర స్థాయిలో 2 స్పెషల్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేయనున్నట్లు తెలిపారు. ఓవర్ లోడింగ్, త్రైమాసిక పన్నులు చెల్లించని, ఫిట్‌నెస్ లేని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్న మంత్రి, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని స్కూల్ బస్సులు, మినీ వ్యాన్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలించే వాహనాలను సీజ్ చేయాలని సూచించారు. అలాగే ఇతర రాష్ట్రాల వాహనాలు పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న అంశంపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారీ జరిమానాలు విధించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీక్షా సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, అడిషనల్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్, జెటిసి చంద్రశేఖర్ గౌడ్, డిటిసి రవీందర్ కుమార్, వెంకట రమణ, సురేష్ రెడ్డి

సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

మంగళవారం 09.06.2026

www.mudranews.in | @mudranews



### వానాకాలం జాగ్రత్తలు

## విద్యుత్ పరికరాలతో అప్రమత్తత



వానాకాలంలో షార్ట్ సర్క్యూట్లు, కరెంట్ షాక్‌లు తగిలే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. తడి చేతులతో స్విచ్‌లను తాకకూడదు మరియు ఇంటి బయట తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలి.

## చంద్ర రాజేశ్వరరావుకు ఘనంగా నివాళులు



**ముద్ర, హైదరాబాద్:** భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ప్రముఖ కమ్యూనిస్టు నేత కీర్తిశేషులు చంద్ర రాజేశ్వరరావు 112వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లో సోమవారం ఘనంగా జయంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చంద్ర రాజేశ్వరరావు విగ్రహానికి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి, సీఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కే నారాయణ, నీలం రాజేశ్వర్ రెడ్డి విగ్రహానికి సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం "బొద్దింకల ఆవిర్భావం – యువత, నెటిజెన్స్ ఎటువైపు" అనే అంశంపై కే శ్రీనివాసరెడ్డి స్మారక ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర రాజేశ్వరరావు దేశ రాజకీయాల్లో, ముఖ్యంగా కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధిలో పోషించిన విశిష్ట పాత్రను పలువురు వక్తలు గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ సభ్యులు పీజే చంద్రశేఖరరావు, హోమ్ డైరెక్టర్ ఈ చెన్నకేశవులు, మెడికల్ డైరెక్టర్ కే రజిని, ఉమెన్ వెల్ఫేర్ డైరెక్టర్ జె కల్పన, ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి రాష్ట్ర మాజీ కార్యదర్శి నిమ్మ రాజు చలపతిరావు, అమ్మనబ్రోలు వెంకట సత్యనారాయణ, అమ్మనబ్రోలు రాం బాబు తదితరులు పాల్గొన్నారు.

# వట్టెం ఆర్ అండ్ ఆర్ కాలనీని పరిశీలించిన కమిషనర్

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని వట్టెం గ్రామం వద్ద నూతనంగా నిర్మించిన పునరావాస మరియు పునర్నిర్మాణ (ఆర్ అండ్ ఆర్) కాలనీని తెలంగాణ రాష్ట్ర ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు సోమవారం అదనపు కలెక్టర్ అమరేందర్‌తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా కాలనీలో నిర్మించిన గృహాలు, అంతర్గత రహదారులు, తాగు నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య వ్యవస్థతో పాటు ఇతర మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పునరావాసం పొందనున్న కుటుంబాలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు నాణ్యతతో కూడినవిగా ఉండాలని కమిషనర్ సూచించారు. కాలనీలో కొనసాగుతున్న పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్వాసితుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పునరావాస కాలనీల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ప్రజలకు అందిస్తున్న సౌకర్యాల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. కాలనీలో కుటుంబాలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



### హత్య చేసి... రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి

## ఇన్సూరెన్స్ డబ్బు కాజేసేందుకు కుట్ర



- ముగ్గురు నిందితుల రిమాండ్
- డీఎస్పీ లింగయ్య

**ముద్ర, నారాయణపేట:** వ్యక్తిని ముగ్గురు నిందితులు హత్య చేసి... రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి ఆ వ్యక్తి పేరు మీద ఉన్న సుమారు రూ.50 లక్షల ఇన్సూరెన్స్ పాలసీ డబ్బులు కాజేసే కుట్రను మక్తల్ పోలీసులు చాకచక్యంగా ఛేదించి నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు డీఎస్పీ లింగయ్య తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం డీఎస్పీ వెల్లడించారు. మరికల్ మండల కేంద్రానికి చెందిన బోడి రాజు(44) పై ఇన్సూరెన్స్ పాలసీ ఉంది. ఈ విషయాన్ని గుర్తించిన నిందితులు అల్లం నాగ రాజు, తిరిగిరి భాను ప్రకాష్, ఆనంపల్లి భాస్కర్ లు పక్కా ప్లాన్‌తో జూన్ 3న బోడి రాజును నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి మద్యం తాగించారు. మద్యం మత్తులో ఉన్న రాజును రాళ్లతో కర్రలతో దాడి చేసి హత్య చేశారు. హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే క్రమంలో హైదరాబాద్ లోని ఉస్మానియా ఆసుపత్రికి కారులో తీసుకవెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రోడ్డు ప్రమాదం జరిగిందని, గాయపడిన రాజును ఆసుపత్రికి తీసుకువస్తే చనిపోయాడని సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు మక్తల్ పోలీస్ స్టేషన్లో రోడ్డు ప్రమాదం ఘటనగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారణలో మక్తల్ ఎస్సై రాజు దండు చౌరస్తా వద్ద ఎలాంటి రోడ్డు ప్రమాదం జరగలేదని గుర్తించారు. ఉద్దేశపూర్వకంగానే ఇన్సూరెన్స్ డబ్బుల కోసం హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే కుట్ర చేశారని తెలిసింది. దీంతో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

విలేకరుల సమావేశంలో మక్తల్ సీఐ రామలాల్, ఎస్ఐ రాజు, ఏఎస్ఐ శంకరయ్య, కానిస్టేబుళ్లు అశోక్ నరేష్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## లోన్ యాప్ వేధింపులు.. వివాహిత ఆత్మహత్య



**ముద్ర మల్కాజిగిరి** నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. శివ దానపు దేవనందిని (25) జైజై నగర్‌లోని ఎస్ఎస్‌బీ క్లాసిక్ అపార్ట్‌మెంట్‌లో తన భర్తతో కలిసి నివాసం ఉంటున్నారు. దేవనందిని 2022 నవంబర్ 8న పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమలకు చెందిన తిరుమల రేవంత్ కుమార్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. వివాహానంతరం దంపతులు నేరేడ్మెట్‌లోని జై జై నగర్‌లో గత మూడు సంవత్సరాలుగా నివసిస్తూ ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ జీవిస్తున్నారు. ఈ నెల 7న ఉదయం పనిమీద బయటకు వెళ్లిన రేవంత్ కుమార్, అనంతరం భార్యకు పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందన రాకపోవడంతో ఇంటికి చేరుకొని బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని దేవనందిని మృతి చెందినట్లు గుర్తించాడు.

మృతురాలి మొబైల్ ఫోన్‌ను పరిశీలించిన పోలీసులు, ఆమె ఓ లోన్ యాప్ ద్వారా రుణం తీసుకున్నట్లు, ఆ రుణాన్ని తిరిగి చెల్లించాలని లోన్ యాప్ ప్రతినిధులు తరచూ వేధింపులకు పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ వేధింపుల కారణంగానే ఆమె తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

అయితే, మృతురాలి తండ్రి భీమవరపు వెంకటరెడ్డి తన కుమార్తె మృతిపై భర్త, మరిది, అత్తమామల పాత్రపై అనుమానం వ్యక్తం చేస్తూ నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## స్కాలర్ షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- జిల్లా కలెక్టర్‌కు ఎస్పీఎఫ్ వినతి



**ముద్ర, కూకట్ పల్లి:** జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో 2021–22 బ్యాచ్‌కు చెందిన ఇంటిగ్రేటెడ్ బీటెక్ విద్యార్థుల పెండింగ్ ఈపాస్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం (ఎస్పీఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు రాహుల్ నాయక్ నేతృత్వంలో సోమవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా రాహుల్ నాయక్ మాట్లాడుతూ, 2021–22 విద్యా సంవత్సరంలో చేరిన అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ కేటగిరీ విద్యార్థులకు సంవత్సరానికి రూ.70 వేల పూర్తి ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ అందాల్సి ఉందన్నారు. అయితే మొదటి, రెండో సంవత్సరాల్లో కేవలం రూ.35 వేల చొప్పున మాత్రమే విడుదల కావడంతో ప్రతి విద్యార్థికి రూ.35 వేల మేర బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల విజ్ఞప్తుల మేరకు ఉన్నతాధికారులు ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని రూ.35 వేల నుంచి రూ.70 వేలకు పెంచారని, మూడో, నాలుగో సంవత్సరాల్లో పూర్తి ఫీజు విడుదలైనప్పటికీ తొలి రెండు సంవత్సరాల బకాయిలు ఇంకా చెల్లించలేదని పేర్కొన్నారు. నాలుగేళ్లు గడిచినా బకాయిలు అందక విద్యార్థుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీఎఫ్ నాయకులు కోరారు.

## డీఎంహెచ్ఓగా బాధ్యతలు స్వీకరించిన డా. కృష్ణ



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** వైద్య మరియు ఆరోగ్య శాఖలో ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె. కృష్ణ నాగర్‌కర్నూల్ జిల్లా కు బదిలీ అయ్యారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా డాక్టర్ కె. కృష్ణ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తానని తెలిపారు. జిల్లాలో అమలవుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి రాష్ట్రంలో నాగర్‌కర్నూల్ జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆరోగ్య శాఖ కార్యక్రమాల విజయవంతమైన అమలుకు ప్రోగ్రామ్ అధికారులు, వైద్య సిబ్బంది, ఇతర ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులు, ప్రోగ్రామ్ అధికారులు, సిబ్బంది డాక్టర్ కె. కృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు.

## చందుబట్ల గ్రామసభలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

- రైస్ మిల్లు తనిఖీ




**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా నాగర్‌కర్నూల్ మండలం చందుబట్ల గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గ్రామసభను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ గ్రామ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు కీలక వేదికలని అన్నారు. ప్రజలకు రక్షణ పరంగా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం చందుబట్ల గ్రామంలోని రైస్ మిల్లును జిల్లా కలెక్టర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులో నిల్వ ఉన్న ధాన్యం, బియ్యం నిల్వలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 74 పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభం

- ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు 2026–27 విద్యా సంవత్సరంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని 74 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రీ–ప్రైమరీ తరగతులు ప్రారంభించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఈ తరగతుల నిర్వహణ కోసం ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానించింది.

అభ్యర్థులు జూన్ 9 నుంచి 15 వరకు సంబంధిత మండల విద్యాధికారి (ఎంఈఓ) కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో పాటు ప్రీ–ప్రైమరీ శిక్షణ లేదా టీటీసీ పూర్తి చేసినవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఆయా పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించారు. స్థానిక అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని అధికారులు తెలిపారు. ఎంపికైన ఇన్‌స్ట్రక్టర్లకు నెలకు రూ.8,000, ఆయాలకు రూ.6,000 గౌరవ భృతి చెల్లించనున్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

జిల్లాలో ప్రీ–ప్రైమరీ విద్య విస్తరణతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు.

## కూకట్‌పల్లి పబ్‌పై పోలీసుల మెరుపు దాడి..

- వెలుగులోకి వ్యభిచారం, నిబంధనల ఉల్లంఘనలు
- తొమ్మిది మంది మంది అరెస్ట్

**ముద్ర, కూకట్ పల్లి:** కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని 'కింగ్స్ అండ్ క్వీన్స్ (క్లబ్ మస్తీ)' పబ్‌పై కూకట్‌పల్లి జోన్ డీసీపీ ఇ. రితిరాజ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం అర్ధరాత్రి మెరుపు దాడి నిర్వహించారు. ఈ తనిఖీల్లో అడిషనల్ డీసీపీ షమీర్, డీఐ కె.ఎస్. రవి తదితరులు పాల్గొన్నారు. పోలీసుల విచారణలో పబ్ యాజమాన్యం నిబంధనలను ఉల్లంఘిస్తూ వ్యభిచారాన్ని ప్రోత్సహించడం, యువతులను ఎరగా ఉపయోగించి కస్టమర్లను ఆకర్షించడం, అధిక బిల్లులు వసూలు చేయడం, అనైతిక కార్యకలాపాలకు మహిళలను సరఫరా చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. అలాగే మద్యం విక్రయ కేంద్రంలో మైనర్ల ప్రవేశాన్ని నిరోధించే చర్యలు లేకపోవడం, అనుమతించిన సమయాన్ని మించి మద్యం, ఆహార పదార్థాల విక్రయం కొనసాగించడం, పోలీసుల నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) లేకుండానే పబ్ నిర్వహించడం వంటి ఉల్లంఘనలు బయటపడ్డాయి. ఈ పబ్‌పై గతంలోనూ పలు కేసులు నమోదై ఉన్నప్పటికీ యాజమాన్యం తీరు మార్చుకోకపోవడంతో పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. దాడి సందర్భంగా పబ్‌లో పనిచేస్తున్న నలుగురు మహిళలు, ఐదుగురు పురుషులతో కలిపి మొత్తం 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. లభించిన ఆధారాల మేరకు పబ్ నిర్వాహకులపై కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లో బీఎన్ఎస్ సెక్షన్లు 223, 292, 318(4) ఆర్/డబ్ల్యూ 3(5)తో పాటు పీఐటీ చట్టంలోని సెక్షన్లు 5, 8 కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ దేవసహాయం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం ప్రజల నుంచి 42 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పాండు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ దేవసహాయం మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయనే విశ్వాసంతో వ్యయప్రయాసలకోర్చి ప్రజావాణికి వస్తారని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అధికారులందరిపై ఉందన్నారు.

ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 09.06.2026
www.mudranews.in | @mudranews



## వానాకాలం జాగ్రత్తలు :



రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం. ఈ కాలంలో ఇన్‌ఫెక్షన్లు త్వరగా సోకుతాయి కాబట్టి వ్యాధి నిరోధక శక్తిని బలోపేతం చేసుకోవడం ముఖ్యం. విటమిన్-సి ఎక్కువగా ఉండే నిమ్మ, ఉసిరి వంటి పండ్లను మరియు అల్లం, వెల్లుల్లి, పసుపు లాంటి పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలి.

## పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని టి జి యు యస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు సునావత్ రాజు అన్నారు రాష్ట్రంలోని సుమారు 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేల పాఠశాలలకు కుదించే ఆలోచనలో ఉన్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించడం ఆందోళన కలిగించే విషయమని, రేషనలైజేషన్ పేరుతో గిరిజన తండాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలు, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పాఠశాలలను మూసివేయడం సామాజిక న్యాయ స్ఫూర్తికి, భారత రాజ్యాంగ లక్ష్యాలకు విరుద్ధమన్నారు. అధికారంలోకి వచ్చిన సమయంలో ప్రతి గ్రామ పంచాయతీకి పాఠశాల ఉండేలా చర్యలు తీసుకుంటామని, మూతపడిన పాఠశాలలను తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం నేడు పాఠశాలల సంఖ్యను భారీగా తగ్గిస్తామని ప్రకటించడం విచారకరం. విద్యా విస్తరణకు బదులుగా విద్యా సంకోచ విధానాలను అవలంబించడం వల్ల పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల విద్యకు మరింత దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యా హక్కు అందుబాటులో ఉండటమే ముఖ్యమేగాని, విద్యార్థులు విద్య కోసం కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి కల్పించడం కాదు. అందువల్ల ప్రభుత్వం పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## నిర్మల్ కవి వెంకట్ కు పురస్కారం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ కు చెందిన పద్యకవి, సంస్కృతభాషా ప్రచార సమితి ఆదిలాబాదు నిజామాబాదు ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షులు డా బి వెంకట్ ఆంధ్రప్రదేశ్ లోని రాజమహేంద్రవరములో ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల పురస్కారాన్ని స్వీకరించారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం లో చైతన్య సారస్వత పరిషత్, శ్రీ శ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ముగిసిన 7 వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలో శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ డా కత్తిమండ ప్రతాప్ కుమార్, జాతీయ అధ్యక్షురాలు జి ఈశ్వరీభూషణం, జాతీయ ప్రణాళిక అధికారి డా టి పారసారధి, గోదావరి గ్లోబల్ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ కె వి వి సత్యనారాయణరాజు చేతులమీదుగా ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల పురస్కారాలను అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బిజేపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నర్సిపల్లి హరిక, జేమ్స్ వాట్ కొమ్ము, హైదరాబాదు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ గౌరీశంకర్, ఆంధ్రప్రదేశ్ రక్షణదళం కమాండెంట్ కొండా నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి అప్పారావు, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ శ్రీనివాస్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ కల్పించాలి



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** ప్రజావాణిలో టియూడబ్ల్యూజే ఐజేయు నాయకుల వినతి జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50% రాయితీ కల్పించాలని కోరుతూ జిల్లా జర్నలిస్టు యూనియన్ (ఐజేయు) పక్షాన సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రాజా గౌడ్ కు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్ జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీ ఇవ్వాలని జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థలను ఆదేశించాలని డిఈవో రాముకు సూచించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షులు చీటి శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణ చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగుల గోపాల్ చారి, కోశాధికారి సిరిసిల్ల వేణు గోపాల్, ఉపాధ్యక్షులు గడ్డల హరికృష్ణ, హైదర్ అలీ, సహాయ కార్యదర్శి గుర్రం చంద్ర శేఖర్, చింత నరేష్, సభ్యులు రాజిరెడ్డి, గాండ్ల వేణు, మనోజ్, జగిత్యాల టౌన్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు శనిగారపు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి నారాయణరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ అలిశెట్టి మదన్ మోహన్, లక్ష్మారెడ్డి, బుర్ర సత్య నారాయణ గౌడ్, క్రాంతి, రాజు నాయక్, భూషణం, శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

## ఐఏఎస్ శిక్షార్థుల క్షేత్రస్థాయి పర్యటన



**ముద్ర, మహదేవపూర్:** డా. ఎం.సి.ఆర్ హెచ్.ఆర్.డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 2025 బ్యాచ్ ఐఏఎస్ అధికారులు శిక్షణలో భాగంగా "తెలంగాణ దర్శన్"lo భాగంగా ఆరుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారులు జూన్ 07 నుండి జూన్ 08 తేదీలలో జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ట్రైనీ అధికారులు చారిత్రాత్మక పాండవులగుట్ట, కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్, చెల్పూర్, సింగరేణి ఓపెన్‌కాస్ట్ అండర్‌గ్రౌండ్ మైనింగ్ లను సందర్శించారు. రెండు రోజుల పర్యటన ముగిసిన అనంతరం, సోమవారం శిక్షణ ఐఏఎస్ అధికారులు ఐడీఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో నిర్వహించిన పర్యటనకు సంబంధించిన వివిధ అంశాలను అధికారుల బృందాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై అధికారులు తమ పరిశీలనలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ విధులు నిర్వహించే ప్రతి అధికారికి క్షేత్ర స్థాయి అవగాహన అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలంటే గ్రామీణ మరియు స్థానిక పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకోవడం అవసరమని సూచించారు.

## పొడి వ్యర్థాల నిర్వహణపై అవగాహన

**ముద్ర, మహదేవపూర్:** ఘన వ్యర్థాల నిర్వహణ నియమావళి, తడి–పొడి చెత్త వేరు చేయడం మరియు పర్యావరణ పరిరక్షణ చట్టాలపై సిబ్బందికి పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా టీజీపీసీబీ నోడల్ అధికారి ఎ. శ్రీకాంత్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మరియు జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ కో–ఆర్డినేటర్ వెంకటేష్ లు క్షేత్రస్థాయిలో చెత్త రహిత గ్రామాలు మరియు పట్టణాల రూపకల్పన, పరిశుభ్రత పాటించడంలో కార్మికుల బాధ్యతలను క్షుణ్ణంగా వివరించారు. ఈ సదస్సులో మున్సిపల్ మరియు స్వచ్ఛ భారత్ మిషన్‌కు చెందిన సుమారు 60 మంది కార్మికులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. మున్సిపల్ పరిధిని పర్యావరణహితంగా మార్చడంలో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని అధికారులు స్పష్టం చేశారు.

## కోరుట్ల బస్టాండ్ లో పోలీసుల విస్తృత తనిఖీలు

**ముద్ర, కోరుట్ల;** జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, కోరుట్ల బస్టాండ్, రద్దీగా ఉండే ప్రాంతాలలో పోలీసులు డాగ్ స్క్వాడ్ తో విస్తృత తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తులు, మాదకద్రవ్యాలు (గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలు) ఎవరైనా సేకరిస్తున్నారా, తరలిస్తున్నారా అని, ముఖ్యమైన ప్రదేశాలలో , జగిత్యాల పోలీస్ హెడ్ క్వార్టర్ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన డాగ్ స్క్వాడ్ ద్వారా తనిఖీ నిర్వహించారు. ఎవరైనా అనుమానిత వ్యక్తుల గురించి, మత్తు పదార్థాల రవాణా గురించి తెలిసినచో సంబంధిత పోలీసు వారికి సమాచారం అందించాలని కోరుట్ల ఎస్సై ఏం. చిరంజీవి సూచించారు.

# విధి విధానాలపై చర్యలేవి?

**పదిరోజులు కావస్తున్నా కమిటీ ఊసే లేదు**
**అమలుకు నోచని ప్రభుత్వ హామీ**
**ఉద్యోగులు, పదవీ విరమణ పొందినవారి ఆవేదన**




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్య పథకానికి సంబంధించి ఎలాంటి చర్యలు లేకుండానే వ్యక్తిగత వేతనాలు, పెన్షన్ నుండి కోత విధించిన ప్రభుత్వం, తదుపరి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో అన్ని చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన హామీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు.ప్రధానంగా ఆరోగ్య పథకంలో వుండాలా? వద్దా ? అనే అంశంపై స్వచ్ఛందంగా నిర్ణయించుకునే అవకాశం లేకపోవటం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ హెల్త్ ఇన్స్యూరెన్స్ పథకాలు వినియోగించుకుంటున్న వారు, కొడుకుల హెల్త్ ఇన్స్యూరెన్సు పై డిపెండెంట్స్ గా ఉన్నవారు అవసరం లేకపోయినా పథకంలో చేరాల్సి వస్తోంది. కొందరు పెన్షనర్లు ఆయుష్మాన్ భారత్ లో కూడా చేరారు. వారు పథకం తమకు వద్దనుకొంటే ఆప్షన్ ఇచ్చే అవకాశం ఉండాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇలా సంతానంపై ఆధారపడ్డవాళ్లు, ప్రైవేట్ ఇన్సూరెన్స్ ఉన్నవాళ్ళు రెండు వైపులా డబ్బులు చెల్లించాల్సి వస్తోంది.ఒకే కుటుంబంలో ఇద్దరు పెన్షనర్లయినా, ఇద్దరు ఉద్యోగులైన ఉంటే వారిలో ఒక్కరి నుండే కోత విధించాలంటున్నారు.అది కూడా ఎవరి నుండి కట్ చేయాలో ఆప్షన్ అడగాల్సిన అవసరం ఉంది. అలాగే గెజిటెడ్, నాన్ గెజిటెడ్, సబార్డినేట్ ఉద్యోగులు, పెన్షనర్లు ఉన్న నేపథ్యంలో వారి స్థాయికి తగిన రీతిలో స్లాబ్ నిర్ణయించాల్సి ఉంది. కానీఅందరికీ 1.5% చొప్పున కంట్రిబ్యూషన్ తీసుకొంటున్నప్పుడు అందరికీ ఒకే విధమైన వార్డులు కల్పించాలంటున్నారు. ఇప్పటికే కరువు భత్యాల మంజూరి లో పెండింగ్, పి ఆర్ సి పెండింగ్ తో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం ఇపుడు ఆరోగ్య పథకం పేరిట వారితో ఆటలాడుకుంటోందని విమర్శలు తలెత్తుతున్నాయి.

## జగిత్యాలను అగ్రగామిగా నిలుపుతా

**జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచి రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రజలు కృషి చేయాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాలలో ప్రజాపాలన వార్డు సభలలో పాల్గొని లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇందిరమ్మ చీరలను ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ లు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ జగిత్యాల పట్టణాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా, ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యావరణ వ్యవస్థను, వృక్షజాలాన్ని, జంతుజాలాన్ని దెబ్బతీస్తున్న ప్లాస్టిక్, కాలుష్య వ్యర్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మన నిర్లక్ష్యం వల్ల తాగే నీరు, పీల్చే గాలి, తినే తిండి కలుషితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఈ పరిస్థితిని మార్చడానికి ప్రతి ఇల్లూ ఒక పునాదిగా మారాలని కోరారు. ఇళ్ల నుండి వచ్చే వ్యర్థాలను రోడ్లపై వేయకుండా తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ వ్యర్థాలు, హానికరమైన కెమికల్ వ్యర్థాలుగా నాలుగు రకాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని స్పష్టం చేశారు.వంటగది వ్యర్థాలైన తడి చెత్త ద్వారా మేలైన ఎరువుల తయారీ జరుగుతుందని, ప్లాస్టిక్, పేపర్ల వంటి పొడి చెత్తను రీసైక్లింగ్‌కు పంపవచ్చని వివరించారు. చిన్నపిల్లల డైపర్లు, ప్యాడ్ల వంటి శానిటరీ వ్యర్థాలను, అలాగే బ్యాటరీలు, కెమికల్ బాటిళ్ల వంటి ప్రమాదకర వ్యర్థాలను విడిగా ఇవ్వడం ద్వారా పారిశుధ్య కార్మికులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పట్టణంలోని 10 నుండి 15 వార్డులలో ఈ సరికొత్త 4–డబ్బాల చెత్త సేకరణ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయబోతున్నట్లు ప్రకటించారు. మనం కలిపి ఇచ్చే చెత్త వలన డబుల్ బెడ్ రూమ్ సముదాయాల వాసులకు ఇబ్బందులు ఏర్పడుతాయని, ప్రజలు సహకరించాలని కోరారు. ఇప్పటికే డబుల్ బెడ్ రూమ్ సముదాయాల వద్ద ప్రైమరీ స్కూల్, హెల్త్ సెంటర్ మొదలైనవి ప్రారంభించుకోవడం జరిగిందని, ఈ నెలలోనే గౌరవ మంత్రి వర్యుల చేతుల మీదుగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, స్థానిక కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, సీఐ కరుణాకర్, నాయకులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది మహిళలు, వార్డు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**ముద్ర, కోరుట్ల;** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కోరుట్ల పట్టణంలోని పలు వార్డు సభలలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ ఇంటి నుండి వెలువడే తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి ఇంటి ముందుకు వస్తున్న మున్సిపల్ వాహనాలకు అందించి పట్టణాన్ని పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దుకుందామన్నారు. కోరుట్ల పట్టణాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా, ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దే బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం మహిళల కోసం అందజేస్తున్న ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తుందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు.


**సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ**

రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని చెడిపోయిన రోడ్లను మరమ్మత్తులు చేయడంలో భాగంగా కోరుట్ల పట్టణంలోని 31వ వార్డులో స్థానిక వార్డు కౌన్సిలర్ వేలుగూరి శ్వేత కిరణ్ లతో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వేలమ కార్పోరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు సహకారంతో కోరుట్ల పట్టణాన్ని అన్ని రంగాల అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, వార్డు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల ఎస్టీవోగా గణేష్

**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయ అధికారిగా గణేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిన్ననాటి మిత్రులైన తుమ్మనపల్లి రాజేంద్ర ప్రసాద్, బి సి సంక్షేమ సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు, మెట్పల్లి మాజీ ఎంపిపి తోగిటి అంజయ్య గణేష్ కు ఆత్మీయ స్వాగతం పలికారు. గణేష్ గతంలో పట్టణంలోని కార్యాలయంలో విధులు నిర్వహించి, ప్రజలకు విలువైన సేవ లు అందించి మంచి గుర్తింపు పొందారని గుర్తు చేశారు. అదే సేవా దృక్పథంతో బాధ్యతల్లోనూ ప్రజలకు మరింత చేరువై, సమర్థవంతమైన పరిపాలన అందిస్తూ విశిష్ట సేవలు కొనసాగించాలని ఆకాంక్షిస్తు శుభాకాంక్షలు తెలిపారు.

## జగిత్యాల డిటిఓ గా సందాని మహమ్మద్



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల నూతన డిటిఓ గా సందాని మహమ్మద్ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ను వారి నివాసం లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛన్ని అందజేశారు.

## నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



**ముద్ర, మహదేవపూర్:** జూన్ 21 ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు నిర్వహించనున్న నీట్ ప్రవేశ పరీక్ష సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నీట్ పరీక్ష నిర్వహణపై రెవెన్యూ, పోలీసు, వైద్య, మున్సిపల్, అగ్నిమాపక, విద్యుత్, పోస్టల్ తదితర శాఖలతో పాటు పరీక్షా కేంద్రాల సి ఎస్ లతో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 388 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. చాలా ప్రతిష్టాత్మక మైన పరీక్ష అని, జిల్లా అధికారులు గత అనుభవం, భద్రతా అంశాలు, ఇంటెలిజెన్స్ నివేదికలు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్వో వసంత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మధుసూదన్, ఎఓ శ్రీనివాసులు, నీట్ సిటీ కో ఆర్డినేటర్ రమణ రావు, సెంటర్ సూపరింటెండెంట్లు శ్రీధర్, బాలు నాయక్, విద్యుత్ శాఖ ఏఈ విశ్వాస్ రెడ్డి, ఆర్టీసీ ట్రాఫిక్ ఇంచార్జి సౌజన్య, ఎంవిఐ శ్రీనివాస్, పోస్టల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, అగ్నిమాపక అధికారి రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి గ్రామసభలే వేదికలు

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**ముద్ర, మహదేవపూర్:** గ్రామాల్లో ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించేందుకు గ్రామసభలు సమర్థవంతమైన వేదికగా నిలుస్తాయని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం మల్హర్ మండలం రుద్రారం గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో సం బంధిత శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో గ్రామసభలు నిర్వహిస్తున్నామని, ప్రతి గ్రామ సభలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలు, ప్రజలకు అందుబాటులో ఉన్న సేవలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎస్.ఐ.ఆర్ నమోదు ప్రక్రియ, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు పంటల సేద్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుధ్యం, కాలుష్య నియంత్రణ, సురక్షిత తాగునీటి నిర్వహణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రుద్రారం గ్రామ సభలో రైతులు పట్టాదారు పాసుపుస్తకాలకు సంబంధించిన సమస్యలు, రహదారులు, డ్రైనేజీ తదితర అంశాలపై వినతిపత్రాలు సమర్పించారని చెప్పారు. అందిన వినతులను సంబంధిత అధికారుల ద్వారా వెంటనే పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , మండల ప్రత్యేక అధికారి మరియు వ్యవసాయ అధికారి బాబూరావు, ఆర్డీఓ రవీందర్, తహసీలార్ రవికుమార్, ఎంపిడిఓ, సీడీపీఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

## నమ్మించి నగలొలిచే కిలాడీ లేడీ అరెస్ట్



**ముద్ర, కోరుట్ల:** వృద్ధులను నమ్మించి మోసం చేస్తున్న లేడీ కిలాడిని కోరుట్ల పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి కోరుట్ల సీఐ. లక్ష్మీనారాయణ పూర్తి వివరాలను పత్రికా సమావేశంలో వెల్లడించారు. కోరుట్ల బస్టాండ్లో రాయికల్ వెళ్లడానికి ఎదురుచూస్తున్న వల్లంపల్లి గ్రామానికి చెందిన కోటే గంగు 70 ఏళ్ల వృద్ధురాలితో మోకానిపల్లె గ్రామానికి దండ్ల లావణ్య (45) పరిచయం పెంచుకొని నీకు మోకాళ్ళ నొప్పులు ఉన్నాయా. నాకు తెలిసిన డాక్టర్ ఉన్నాడని నమ్మించి వృద్ధురాలిని ఆటోలో పట్టణంలోని నంది చౌరస్తా వద్దకు తీసుకెళ్లి అక్కడ ఒక బిల్డింగ్ చూపించి ఇందులో డాక్టర్ ఉంటాడని, నీకు ఎక్స్ రే తీయాల్సి ఉంటుంది అని మెడలో ఎలాంటి వస్తువులు ఉండకూడదు అని ముసలావిడ మెడలోని 25 గ్రాముల బంగారు గొలుసును తీసుకొని ఆమెను ఒకచోట కూర్చోబెట్టి కూరగాయలు కొనుక్కొని వస్తానని నమ్మించి వెళ్ళిన మహిళ తిరిగి రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన ముసలావిడ రాత్రి కోరుట్ల ఎస్ఐ చిరంజీవిని ఆశ్రయించగా కేసు నమోదు చేసిన వెంటనే తన సిబ్బందితో రంగంలోకి దిగి బస్టాండ్, నంది కమాన్ ఏరియాలో అమర్చిన సీసీ కెమెరాలను పరిశీలించారు. వృద్ధ మహిళ ద్వారా నేరస్తు రాలి వివరాలు సేకరించారు. ఇదే క్రమంలో సోమవారం కోరుట్ల బస్టాండ్ వద్ద ఆ మహిళను గుర్తించి అదుపులోనికి తీసుకొని విచారించారు. గతంలో ఈ మహిళపైన ఇదే రకమైన ప్రవృత్తితో వివిధ పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు అయి ఏడాది పాటు జైలు జీవితం గడిపి బయటకు వచ్చిన తర్వాత మళ్లీ దొంగతనాలు చేయాలని నిర్ణయించుకొని శనివారం వృద్ధ మహిళను మోసగించి ఎత్తుకెళ్లిన బంగారాన్ని అదే రోజు సాయంత్రం నిజామాబాద్ లోని ఆకుల ప్రసాద్, అను స్వర్ణకారునికి అమ్మగా వచ్చిన రెండు లక్షల 50 వేల రూపాయల నుండి కొంత ఖర్చు చేసుకోగా, మళ్లీ దొంగతనం చేయడానికి సోమవారం కోరుట్ల వచ్చిన ఆ మహిళ వద్ద నుంచి రూ.రెండు లక్షల మూడువేలు అలాగే దొంగ సొత్తు కొన్న ఆకుల ప్రసాద్ వద్ద నుండి బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. దొంగ బంగారం కొన్న ఆకుల ప్రసాద్ పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. మెట్‌పల్లి డీఎస్పీ రాములు పర్యవేక్షణలో సీఐ లక్ష్మీనారాయణ సూచనల మేరకు లేడీ కిలాడీని పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్సై ఏం చిరంజీవి, సిబ్బంది ఏఎస్ఐ రాజశ్రీ, హెడ్ కానిస్టేబుల్ లింబాద్రి, కానిస్టేబుల్ కిరణ్, రాజ్ కిరణ్ లను ఎస్పి శ్రీ అశోక్ కుమార్, డీఎస్పి రాములు అభినందించారు.

**వానాకాలం జాగ్రత్తలు :** వ్యక్తిగత పరిశుభ్రత బయటి నుంచి ఇంటికి రాగానే చేతులను, కాళ్లను యాంటీసెప్టిక్ సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. శరీరం, ముఖ్యంగా కాళ్లు తడిగా ఉండకుండా పొడిగా ఉంచుకుంటే ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఉంటాయి.



## వెలుగుమట్లలో ఇళ్లు కూల్చిన వారిని శిక్షించండి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ , భూదాన బాధితుల నిజనిర్ధారణ కమిటీ ఆధ్వర్యంలో వేలాది మందితో ఖమ్మం పురవీధుల్లో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తోట్ల రాఘవేంద్ర ముదిరాజ్ మాట్లాడుతూ రాజ్యాంగా స్ఫూర్తితో రాజ్యాంగబద్ధంగా రాష్ట్రపతికి, ప్రధానమంత్రి కి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి తెలంగాణ గవర్నర్ కి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి బాధితులు తమ బాధను ఉత్తరాల ద్వారా విన్నవించుకోవడం అనేది ఇంత పెద్ద మహా ర్యాలీని నిర్వహించడం అనేది అంబేద్కర్ స్ఫూర్తితో నిర్వహించామన్నారు.వెలుగుమట్ల లో ఇళ్ల కూల్చివేతకు కారకులైన మంత్రులు , అధికార ప్రతినిధులు మేల్కొని వెలుగుమట్లలో 100 గజాల్లో అర్హులైన బాధితులకు ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ ఖమ్మంలో జరిగింది ఓ నరమేధమని ఇది రాజ్యాంగ స్ఫూర్తిగా విరుదమని తమ ఆత్మగౌరవం నిలుపుకునేందుకు స్థానిక మంత్రులను అధికారులను శిక్షించేందుకు భారత రాష్ట్రపతిని కలిసి న్యాయం చేయాలని కోరతామన్నారు. పేదలకు న్యాయం జరిగే వరకు అన్ని సామాజిక సంస్థలు ఆయా రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కోరారు. స్థానిక అడ్వకేట్ వంజాకుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఖమ్మం ప్రాంతంలో ఇంత రాజ్యాంగ స్ఫూర్తితో ర్యాలీని నిర్వహించడం గర్వకారణమని బాధితులే తమ బాధను ఉత్తరాల రూపంలో రాష్ట్రపతికి అందించడం బాధితులు చేస్తున్న ఈ జ్ఞాన పోరాటం ఈ దేశానికి అంకితం అని అన్నారు. ఇకనైనా అధికారులు మేల్కొని తక్షణమే వారికి ఇల్లు నిర్మించాలని అన్నారు. నిజానిధారణ కమిటీ కన్వీనర్ తొలి కృష్ణారావు మాట్లాడుతూ మా ఇల్లు సాధించుకునే దాకా ఈ పోరాటం కొనసాగుతుందని ఇది మా ఆత్మగౌరవ పోరాటమని అన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ వట్టే ఉదయ్ కిరణ్, మట్టే నవ్య, సుమలత, రామకృష్ణ, కృష్ణ, రాము పాల్గొన్నారు..

## "మెపా" జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెద్దబోయిన రామకృష్ణ ముదిరాజ్



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ – మెపా యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెద్దబోయిన రామకృష్ణ ముదిరాజ్ ను నియమిస్తూ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ సోమవారం జిల్లా కేంద్రంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ జాతి బిడ్డలు హక్కుల కోసం ఐక్యంగా పోరాటం చేయాలని అన్నారు. అనంతరం రామకృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి దాసరి వీరన్న ముదిరాజ్, జిల్లా అధ్యక్షులు గుర్రాల బాలకృష్ణ ముదిరాజ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గంగరబోయిన కిరణ్ ముదిరాజ్ లతో పాటు యాదాద్రి జిల్లా మెపా నాయకులు

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం



**ముద్ర ప్రతినిధి, సూర్యాపేట:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 35వ వార్డు కౌన్సిలర్ జ్యోతి శ్రీవిద్య ఏర్పాటు చేసిన చర్చి కాంపౌండ్‌లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూర్యాపేటను స్వచ్ఛతలో రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిపేందుకు మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. సూర్యాపేటను గంజాయి రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. డీఎస్పీ ప్రసన్నకుమార్, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, పట్టణ సిఐ వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి, జ్యోతి కరుణాకర్,బైరబోయిన శ్రీనివాస్, నాయకులు నిమ్మల వెంకన్న, టీఎంసీ శ్వేత, వార్డ్ ఆఫీసర్ ఉమా రాణి, అంబేద్కర్ నగర్ అర్బన్ హాస్పిటల్ హెల్త్ ఆఫీసర్, మున్సిపాలిటీ మేనేజర్ ఎం బుచ్చిబాబు, ఆశ వర్కర్ ఎస్కె షబీనా సుల్తానా, ధనమ్మ, ఆర్పీ జాస్మిన్ , వార్డు జవాన్ మల్లేష్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి , వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 72 అర్జీలను స్వీకరించారు. అందులో రెవిన్యూ శాఖ 48, మున్సిపాలిటీ 7, సర్వే ల్యాండ్ 3, గ్రామీణ అభివృద్ధి 3, పిడి హౌసింగ్ 3, సంక్షేమ శాఖ 2, వ్యవసాయ, ఇరిగేషన్, ఉపాధి కల్పన, విద్య, బీసీ వెల్ఫేర్, ఎస్సీ కార్పొరేషన్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి , ఆర్డీవో శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## వృద్ధాశ్రమంలో అన్నదానం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పిసిసి డెలిగేట్ మాజీ ప్రణాళిక బోర్డు సభ్యుడు తంగళ్ళపల్లి రవికుమార్ జన్మదినం సందర్భంగా సోమవారం కాంగ్రెస్ నాయకులు హేరేకార్ శ్రీను ఆధ్వర్యంలో రాయగిరి వృద్ధాశ్రమం లో చిన్నపిల్లలతో కలిసి అన్నదానం పండ్లు పంపిణీ చేశారు. నాయకులు శివ, సిలువేరు శ్రీను, గోపి, ఎల్లయ్య, చిన్నారులు అర్చన, అఖిల, సందేశ్, అనుశ్రీ పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి

**రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**



**ముద్ర ప్రతినిధి ఖమ్మం:** భావితరాలకు ఉపయోగపడేలా గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులను అత్యుత్తమ నాణ్యతతో అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం వి.వి.పాలెం గ్రామంలో కలిసి రూ.97 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన పశు వైద్యశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వి.వి.పాలెం గ్రామంతో తనకు సుదీర్ఘ అనుబంధం ఉందని తెలిపారు. 1982లో దివంగత ఎన్టీఆర్‌తో కలిసి తొలిసారిగా గ్రామానికి వచ్చినట్లు గుర్తు చేశారు. ఎన్టీఆర్ ప్రభుత్వ కాలంలో ఎత్తిపోతల పనులు చేపట్టామని, అనంతరం ప్రతి ప్రభుత్వ హయాంలోనూ గ్రామ అభివృద్ధికి కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లే గ్రామాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంత్రి సూచించారు. జిల్లా పశు వైద్యశాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని ఆర్డీవోను ఆదేశించినట్లు చెప్పారు. అత్యంత పేదలకు గృహ స్థలాలు అందించేందుకు అవసరమైన భూమిని గుర్తించాలని సూచించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ,సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.పురంధర్, వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్, తహసీల్దార్ శ్వేత, సర్పంచ్ కాపా ఆదినారాయణ, ఉప సర్పంచ్ గుగులోతు ప్రవీణ్ నాయక్, ఆత్మ పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

**రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**నిర్మాణ పురోగతి ఆధారంగా ప్రతి సోమవారం బిల్లులు విడుదల**

**రాజకీయాలకు అతీతంగా ఇళ్ల మంజూరు**

**కూసుమంచి మండలంలోని రాజుపేట, గట్టు సింగారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. సోమవారం కూసుమంచి మండలంలోని రాజుపేట, గట్టు సింగారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. కేవలం ఇళ్ల మంజూరుతోనే బాధ్యత ముగిసిపోయిందని భావించకుండా నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతి సోమవారం బిల్లులు విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు.ఈ లక్ష్యంతోనే రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించామని వెల్లడించారు. నూతనంగా ఇళ్లు నిర్మించుకుని గృహప్రవేశం చేసిన కుటుంబాలకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఇంట్లో సుఖ సంతోషాలతో, ఆత్మగౌరవంతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు

ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ రంగంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. సోమవారం కూసుమంచి మండల కేంద్రంలో రూ.35 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన విద్యుత్ రెవెన్యూ కార్యాలయ భవనాన్ని మంత్రి, ,కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వినియోగదారునికి అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. నూతనంగా నిర్మించిన ఈఆర్వో కార్యాలయం ద్వారా విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని, విద్యుత్‌కు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ కార్యాలయం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



### కాంగ్రెస్ లో చేరిక

ఖమ్మం రూరల్ మండలంలోని బీఆర్ఎస్, సీపీఎం సహా వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాలు కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమానికి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివృద్ధి మంత్రానికి ఆకర్షితులై పార్టీలో చేరారు. క్యాంప్ కార్యాలయ ఇన్‌ఛార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి వీరందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ గూటికి చేరిన వారిలో రాయల సైదులు, మారపొంగు నరేష్, సిరిపల్లి లక్ష్మయ్య, గార్లపాటి ఉపేందర్, వరగాని ఉపేందర్ తదితర కుటుంబాలు ఉన్నాయి. దశాబ్దాల వెనుకబాటుకు పొంగులేటి చొరవతోనే మోక్షం లభిస్తుందని నమ్మి, తమ గ్రామాభివృద్ధి కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం, కళ్యెం వెంకట్ రెడ్డి, మద్ది మల్లారెడ్డి, మద్ది వీరారెడ్డి, ముత్యం చిన్ని కృష్ణారావు, ఖమ్మం రూరల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోటి రమణ, పొన్నేకల్ గ్రామ శాఖ అధ్యక్షుడు వంగూరి రవి, లింగా శ్రీనివాస్, గునిగంటి రమేష్, తేళ్లపూడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

**సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**



**పిలుపుముద్ర ప్రతినిధి, సూర్యాపేట:** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ పార్టీ కార్యకర్తలు రాజీలేని పోరాటం కొనసాగించాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు సోమవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం (ధర్మభిక్షం) భవన్ లో జరిగిన ఆ పార్టీ జిల్లా కార్యవర్గం, కౌన్సిల్ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచుకుంటూ సామాన్యుడి, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచారని దుయ్యబట్టారు. అందువల్ల ఈ నెల 10న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఐ పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అలాగే ఈనెల 23, 24 తేదీల్లో సూర్యాపేట జిల్లా స్థాయి ముఖ్య నాయకులకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని ఆగస్టు 6 నుంచి 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహించనున్నామని సెప్టెంబర్ 28న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జూన్, జూలై నెలలో అఖిల భారత యువజన సమాఖ్య, జాతీయ మహిళా సమాఖ్య, అఖిల భారత విద్యార్థి సమాఖ్య, గిరిజన సమాఖ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా మహాసభలు నిర్వహించనున్నామని ఈ నెలాఖరుకు సభ్యత్వంలో పూర్తి చేయాలని చేసి శాఖ మండలం మహాసభలు పూర్తిచేసి ఆయా ప్రజా సంఘాల జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి పోకల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు, ధూళిపాళ ధనుంజయ నాయుడు, యల్లంల యాదగిరి, బద్దం కృష్ణారెడ్డి, గుండు వెంకటేశ్వర్లు, దేవవరం మల్లీశ్వరి, బూర వెంకటేశ్వర్లు, ఎస్ కే సాయబెల్లి, అనంతుల మల్లీశ్వరి, ఖమ్మంపాటి రాము, కొండ కోటయ్య, రెమిడాల రాజు, ఉత్పతల కోటమ్మ చిలకరాజు శ్రీను, ఏడెల్లి శ్రీకాంత్, పాల్గొన్నారు.

## మల్లేశం సేవలు మరువలేనివి

**సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్.**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పేద ప్రజలకు, కష్టజీవులకు అండగా నిలిచి వారి వైపు పోరాడిన గొప్ప వ్యక్తి, ప్రజలకు కామ్రేడ్ కొలుపుల మల్లేశం చేసిన సేవలు మరువలేమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ అన్నారు. సోమవారం పట్టణంలోని హనుమాన్ వాడలో మల్లేశం 36వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ దోపిడీ, కుల వివక్షపై ఆయన చేసిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ "గార్లపాటి జగ్గయ్య నగర్‌లో అత్యంత నిరుపేదలకు ఇళ్లు నిర్మించుకునేందుకు భూ పోరాటం చేసిన యోధుడు అన్నారు. అణగారిన వర్గాల్లో రాజకీయ చైతన్యం తీసుకురావడంలో ఆయన చొరవ మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్ల ముత్యాలు, సీపీఎం నాయకులు కొలుపుల విజయకుమార్, కొలుపుల వివేకానంద, వనం రాజు, వడ్డే కృష్ణ, పడిగం కిషన్, నరాల నరసింహ, ఆరే విజయకుమార్, బాండ్ అజయ్ సింగ్, కొత్త లలిత, కొలుపుల సోహన్, దయాకర్ పాల్గొని మల్లేశంకు నివాళి అర్పించారు.

## నేటి నుంచి బీజేపీ జిల్లా స్థాయి శిక్షణ కార్యశాల


**రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఎంపి ధర్మపురి అర్వింద్ రాక**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** నేడు, రేపు యాదగిరిగుట్ట సమీపంలోని సురేంద్రపురి వాసవి సత్రంలో జరగనున్న బిజెపి "పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్–2026" జిల్లా స్థాయి శిక్షణ కార్యశాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఎంపి ధర్మపురి అరవింద్ హాజరవుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.పార్టీ సంస్థాగత బలోపేతం, సిద్ధాంతాల అవగాహన, ప్రజా సమస్యలపై పోరాట విధానాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, బూత్ స్థాయి కమిటీల పటిష్టత, నాయకత్వ లక్షణాల పెంపు వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ శిక్షణ కార్యశాలలో మండల అధ్యక్షులు, మండల ప్రభారీలు, మండల ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా పదాధికారులు, మాజీ పదాధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారని పేర్కొన్నారు.

### వానాకాలం జాగ్రత్తలు

### ప్రయాణాల్లో ముందస్తు ప్లానింగ్



వర్షాల వల్ల రోడ్లపై నీరు చేరి ట్రాఫిక్ జామ్‌లు, గుంతల సమస్యలు ఎదురవుతాయి. బయటకు వెళ్లేటప్పుడు ఎప్పుడూ గొడుగు లేదా రెయిన్ కోట్ వెంట ఉంచుకోవాలి మరియు రోడ్ల పరిస్థితిని గమనిస్తూ వాహనాలను నిదానంగా నడపాలి.

## ఈవీఎం గోదాం తనిఖీ



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఈవీఎం గోదాంను సోమవారం కలెక్టర్ ప్రతిమా సింగ్ త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు.

అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ గఫార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులున్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

### - జిల్లా ఆసుపత్రి కమిటీ సమావేశంలో కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రభుత్వ ఆసుపత్రిలో మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. మెదక్ మాతా శిశు ఆసుపత్రిలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీత ఆధ్వర్యంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించగా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ మాతా, శిశు ఆసుపత్రిలో ఇన్ఫ్రాస్ట్రక్చర్, సిబ్బంది నియామకం, ఆసుపత్రి నిర్వహణ, అంబులెన్స్ ఇతర అంశాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్ర చికిత్స, వైద్య పరికరాలు, పెండింగ్ బిల్లుల కోసం చర్చించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, ఆ దిశగా నర్సులు, ఆసుపత్రి సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందికి శిక్షణ అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలోని వార్డులు, పరిసర ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ఆసుపత్రిలో ప్రజా ప్రయోజనకరంగా అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు అందించాలని తెలిపారు.

### క్రిటికల్ కేర్ సందర్శన

నూతనంగా నిర్మించి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్న క్రిటికల్ కేర్ విభాగాన్ని కలెక్టర్ సందర్శించారు. వైద్యాధికారులకు పలు సలహాలు సూచనలు అందించారు. ఈ



సమావేశంలో డిసిహెచ్‌ఎస్ డా.శివదయాల్, ఆర్ఎంఓ డాక్టర్ షర్మిల, జిజిహెచ్ ఆర్ఎంఓ రేవతి, ప్రిన్సిపల్ నితిన్ కాబ్రా, హెచ్ఓడి జనరల్ మెడిసిన్ డాక్టర్ రవీంద్ర కుమార్, డాక్టర్ రాజేశ్వరి, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ పావని, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి, కార్యదర్శి సుభాష్ చంద్ర బోస్, అభివృద్ధి కమిటీ సభ్యులు కొట్టాల విశ్వం, సాంసన్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### - అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశం



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రజావాణి అర్జీలను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వారు దరఖాస్తులు సమర్పించారు. ప్రజలు సుదూర ప్రాంతాల నుండి వచ్చి సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన దరఖాస్తులను అధికారులు తక్షణమే పరిష్కరించి న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ అంబదాస్ రాజేశ్వర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### వినతులు స్వీకరించిన ఎస్పీ




మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదులను ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు స్వీకరించారు. ఫిర్యాదుదారునితో మాట్లాడి వారి సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులను పరిశీలించి, వాటిపై సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత సీఐలు, ఎస్ఐలకు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ఫిర్యాదుల విషయంలో సంబంధిత ఎస్‌హెచ్‌వోలతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

## ప్రజావాణిలో 188 దరఖాస్తుల స్వీకరణ

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి అని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు అర్జిదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో అర్జిలు మొత్తం 188 వచ్చాయి. అర్జిదారులకు న్యాయం చేసి తిరిగి అర్జి పెట్టుకోకుండా పని చెయ్యాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, ఎస్డిసి వరలక్ష్మి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సిద్దిపేట జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా రాజులు

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా గుర్రప్పగారి రాజులు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కర్రు రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు నీలం యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల సమావేశంలో ఈ ఎన్నికలు జరిగాయి.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు పుట్టా పురుషోత్తం మాట్లాడుతూ, మున్నూరుకాపుల జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో తగిన ప్రాతినిధ్యం, వాటా కల్పించేందుకు సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్నూరుకాపులను ఏకం చేసి వారి హక్కుల సాధన కోసం ఉద్యమిస్తామని పేర్కొన్నారు.




రాష్ట్ర అధ్యక్షుడు పుట్టా పురుషోత్తం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంగళారపు లక్ష్మణ్ పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన నాయకులను శాలువాలతో సత్కరించి అభినందించారు. నూతన అధ్యక్షుడు గుర్రప్పగారి రాజులు, ప్రధాన కార్యదర్శి కర్రు రవీందర్ మాట్లాడుతూ మున్నూరుకాపుల హక్కుల పరిరక్షణతో పాటు రైతుల సమస్యల పరిష్కారం కోసం సంఘం తరపున అండగా నిలిచి పోరాటం చేస్తామని తెలిపారు. తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాయకం తిరుపతి, నీలం యాదగిరి, బుస్స శ్రీనివాస్, డాక్టర్ భూమయ్య తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

## పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి

### - డీజీపీ సీవీ ఆనంద్

**ముద్ర, నిజామాబాద్:** పోలీస్ శాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకునేందుకు సీసీటీఎన్ఎస్ 2.0(క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ సిస్టం), ఈ–సాక్ష్య అమలుపై డైరెక్టర్ జనరల్ పోలీస్ ఆఫ్ పోలీస్ సీవీ ఆనంద్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో నిజామాబాద్ జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు. సీసీటీఎన్ఎస్ 2.0 ద్వారా నేరాలు, నేరస్తుల సమాచారాన్ని వేగవంతంగా నమోదు చేయడంతో పాటు దర్యాప్తు ప్రక్రియను డిజిటలైజ్ చేయడం, ప్రజలకు అందించే సేవలను మరింత పారదర్శకంగా/సమ్మర్థవంతంగా చేయడంపై డీజీపీ సూచనలు చేశారు.

ఈ–సాక్ష్య వ్యవస్థ ద్వారా నేర సంఘటనకు సంబంధించిన డిజిటల్ ఆధారాలు సేకరించడం, భద్రపరచడం, కోర్టు విచారణలో సమర్పించే విధానాన్ని మరింత




స్పష్టంగా అమలు చేయాలని ఆయన సూచించారు. సంబంధిత అధికారులు ఈ వ్యవస్థల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. పోలీస్ వ్యవస్థను ఆధునికరించడం, దర్యాప్తు నాణ్యతను పెంపొందించడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా అధికారుల నుండి డిజిటల్ వ్యవస్థ అమలు పురోగతిపై వివరాలు తెలుసుకొని, అవసరమైన మార్గదర్శకాలను జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో నిజామాబాద్ అదనపు డీసీపీ శుభం ప్రకాష్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్, సీటీసీ ఏసీపీలు ప్రకాష్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, మస్తాన్ అలీ, రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, మల్లేష్, సీసీఆర్‌బీ, సీపీఆర్ సీఐలు అంజయ్య, వీరయ్యతోపాటు సీఐలు, ఎస్ఐలు, ఐటీ కోర్స్ సిబ్బంది, స్టేషన్ రైటర్లు, రేషన్ టెక్నీషియన్స్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యమివ్వాలి

### - డీపీవో శ్రీనివాసరావు

**ముద్ర, నిజామాబాద్:** పరిసరాల పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని డీపీవో శ్రీనివాసరావు అన్నారు. భీమ్‌గల్ మండలంలోని పల్లికొండ గ్రామంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఆయన పాల్గొని గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. వర్షాకాలం సన్నద్ధతలో భాగంగా ప్రతీ కుటుంబం, వారి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలో పిచ్చి మొక్కలు తొలగించి మురికి కాలువలు శుభ్రం చేసి సరిపడా బ్లీచింగ్ పౌడర్ చల్లి యాంటీ లార్వా స్ప్రే చేస్తూ ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యవంతులను చేయాలన్నారు. సురక్షిత తాగునీరు అందే విధంగా గ్రామపంచాయతీలు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంట్లోనే తడి పొడి చెత్తను వేరుచేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్ కు అందించాలని అన్నారు.



రోడ్డుపై గాని మురికి కాలువల్లో గాని చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ ఇంటికి జల సంరక్షణ–మన సంరక్షణ అనుకొని ఇంకుడు గుంత నిర్మించుకునే విధంగా వారిని చైతన్యవంతులను చేయాలన్నారు. రాబోయే వర్షాకాలం దృష్ట్యా మొక్కలు నాటడానికి స్థలాలను గుర్తించి వాటిని నాటి, కాపాడాలని కోరారు. ప్రతీ ఇంట్లో ఐదు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ గ్రామంలో జీపీవో, బీఎల్ఓల ద్వారా ఎన్యూమరేషన్ ఫామ్స్ నింపి ఓట్లన్నీ నమోదు చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్, సర్పంచ్ వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, మహిళా సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



## పోలీస్ ప్రజావాణిలో 13 ఫిర్యాదుల స్వీకరణ

**ముద్ర, నిజామాబాద్:** నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాధితుల సమస్యలపై నిర్వహిస్తున్న పోలీస్ ప్రజావాణి కార్యక్రమంలో 13 ఫిర్యాదులు స్వీకరించినట్లు నిజామాబాద్ అదనపు డిసిపి(అడ్మిన్) శుభం ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కామారెడ్డి ఎస్పీ, నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు నిజామాబాద్ అదనపు బాధితుల ద్వారా ఫిర్యాదులు స్వీకరించారు. చట్టపరమైన చర్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు అవసరమైన సూచనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బాధితుల సమస్యలను నేరుగా పోలీస్ అధికారికి చెప్పుకునేందుకు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఈ పోలీస్ ప్రజావాణి కొనసాగించినట్లు వెల్లడించారు. బాధితుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వాటిని చట్ట ప్రకారం పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు, సీఐలను ఫోన్‌లో ఆదేశించారు. అంతేకాకుండా బాధితులు మూడో వ్యక్తితో పని లేకుండా నేరుగా ఇక్కడికి వచ్చి తమ సమస్యలపై ఫిర్యాదు చేసే అవకాశం ఉందని అదనపు డీసీపీ శుభం ప్రకాష్ వెల్లడించారు.

## గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

**ముద్ర, నిజామాబాద్:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సౌత్ రూరల్ పరిధిలో గల మోపాల్ పోలీస్ స్టేషన్ విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఏ గంగాధర్ (హెచ్‌సీ,1173) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. 1998 బ్యాచ్ కు చెందిన గంగాధర్ ఏడాది క్రితం వరకు నిజామాబాద్ నార్త్ రూరల్ పరిధిలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తించాడు. అనంతరం ఆయన హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొందడంతో అక్కడి నుండి మోపాల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చి విధులు నిర్వహిస్తున్నారు.

సోమవారం ఆయన మోపాల్ మండల పరిధిలో జరిగిన కార్యక్రమంలో మధ్యాహ్నం వరకు విధులు నిర్వహించాడు. అనంతరం ఆయన అక్కడి నుండి భోజనం చేసేందుకు నిజామాబాద్ నగరంలోని నాల్కల్ రోడ్ లో గల తన ఇంటికి వచ్చారు. ఇంట్లో భోజనానికి ఉపక్రమించే సమయంలో చాతి నొప్పి వస్తుందని చెప్పడంతో అతడి భార్య, కుమారుడు కలిసి గంగాధర్‌ను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆసుపత్రిలో ఆయనను పరీక్షించిన వైద్యులు మరణించినట్లుగా నిర్ధారించారు. ఆయన మృతి పట్ల నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్, సౌత్ రూరల్ సీఐ సురేష్, మోపాల్ ఎస్సై తోపాటు తోటి సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 09.06.2026
www.mudranews.in | @mudranews



## వానాకాలం జాగ్రత్తలు

అత్యవసర పరిస్థితుల కోసం ఇంట్లో అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవడం మంచిది. జ్వరం, జలుబు, దగ్గు, కడుపునొప్పి వంటి సాధారణ సమస్యల మందులతో పాటు ఓఆర్ఎస్ (ORS) ప్యాకెట్లను కూడా అందుబాటులో ఉంచుకోవాలి.




### టీమిండియా మ్యాచ్ ఆడుతుంటే
## ఇంతటి దారుణ పరిస్థితా?

టీమిండియా క్రికెట్ మ్యాచ్ లు ఆడుతుంటే మైదానాలు అభిమానులతో సందడిగా మారుతుంటాయి. కొన్ని సందర్భాలలో మైదానంలో టికెట్లు సంపాదించుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేయాల్సి ఉంటుంది. ఒక్కోసారి టికెట్లు దొరకవు కూడా. సామాన్యులకే కాదు.. సెలబ్రిటీలకు కూడా ఇటువంటి పరిస్థితి ఎదురవుతూ ఉంటుంది.

మనదేశంలో క్రికెట్ అనేది ఒక మతం అయితే.. ప్రపంచంలోనే అత్యధికమంది ఆచరించే మతంగా కొనసాగుతుంది. దీన్నిబట్టి మనదేశంలో క్రికెట్ చూసే వాళ్ళ సంఖ్య ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. పైగా మన దేశంలో క్రికెట్ మ్యాచ్ లకు విపరీతమైన ప్రయారిటీ ఇస్తూ ఉంటారు. ఐపీఎల్ లాంటి ఫార్మాట్ ప్రపంచ స్థాయి ప్రఖ్యాతి సాధించడం.. లక్షల కోట్ల మార్కెట్ సొంతం చేసుకోవడం మామూలు విషయాలు కావు. ఇవన్నీ కూడా అభిమానులు ఆటకు విపరీతమైన ఆదరణ అందించడం వల్లే సాధ్యమయ్యాయి. అయితే మన దేశంలో క్రికెట్ కు గడ్డు రోజులు వచ్చాయేమో అనిపిస్తోంది. ఆఫ్ఘనిస్తాన్ జట్టుతో భారత్ ఏకైక టెస్ట్ ఆడుతోంది. చండీగఢ్ వేదికగా ఈ మ్యాచ్ జరుగుతోంది. ఈ మ్యాచ్ లో భారత్ దాదాపుగా విక్టరీ సాధించినట్టే. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఈ మ్యాచ్ చూసేందుకు అభిమానులు భారీగా తరలి రాలేదు. మొత్తంగా చూస్తే వెయ్యి మంది కూడా మైదానంలో లేరంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జనాలు లేకపోవడంతో స్టేడియాన్ని చూసి వ్యాఖ్యాతలు కూడా ఆశ్చర్యపోయారు."ఐపీఎల్ లో అభిమానులు భారీగా మైదానాలకు తరలివచ్చారు. ప్రతి మైదానం కూడా అభిమానుల రాకతో సందడిగా మారిపోయింది. కొన్ని సందర్భాలలో ఇసుకవేస్తే రాలనంతగా ఫ్యాన్స్ రావడంతో.. ఐపీఎల్ నిర్వాహకులు పండగ చేసుకున్నారు. అయితే ఐపీఎల్ ముగిసిపోయింది. ఇప్పుడు భారత్ ఆఫ్ఘనిస్తాన్ తో ఏకైక టెస్ట్ ఆడుతోంది. ఈ మ్యాచ్లో గిల్ సేన విక్టరీ దిశగా సాగుతున్నప్పటికీ.. ఆఫ్ఘనిస్తాన్ జట్టుతో మ్యాచ్ అనగానే చాలామంది ఫ్యాన్స్ లో అంతగా ఆసక్తి అనిపించలేదు. అందువల్లే మ్యాచ్ చూసేందుకు పెద్దగా మైదానం లోకి రాలేదు. ఆఫ్ఘనిస్తాన్ జట్టుతో జరుగుతున్న మ్యాచ్ డొమెస్టిక్ మ్యాచ్ మాదిరిగా అనిపిస్తోంది అంటే.. పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.


# రోహిత్ మీద గంభీర్ కక్ష కట్టాడా..?

ధోని తర్వాత టీమిండియాలో అంతటి ప్రభావాన్ని చూపించిన నాయకుడు రోహిత్ శర్మ.. టీమ్ ఇండియాకు టి20 వరల్డ్ కప్ అందించాడు. వన్డే వరల్డ్ కప్ లో ఫైనల్ దాకా తీసుకెళ్లాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ ఫైనల్స్ దాకా టీమ్ ఇండియాను తీసుకెళ్లాడు. భారత జట్టుకు చాంపియన్ ట్రోఫీ అందించాడు. రోహిత్ శర్మ ఎలాంటి ఫార్మాట్లోనైనా అద్భుతంగా ఆడగలడు. అందువల్లే అతడిని ప్రమాదకర ఆటగాడు అని పిలుస్తారు.

టీమిండియా టి20 వరల్డ్ కప్ సాధించిన తర్వాత ఆ ఫార్మాట్ నుంచి రోహిత్ తప్పుకున్నాడు. మేనేజ్మెంట్ తీసుకొచ్చిన ఒత్తిడి.. గౌతమ్ గంభీర్ నుంచి వచ్చిన ఒత్తిడి.. వల్ల అతడు సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకున్నాడు. ఎవరు అంచనా వేయకుండానే.. ఎటువంటి సంకేతాలు ఇవ్వకుండానే అతడు జట్టు నుంచి తప్పుకున్నాడు. రోహిత్ టెస్ట్ జట్టు నుంచి తప్పుకోవడం చాలామంది అభిమానులకు రుచించలేదు. చాలామంది అభిమానులు తమ ఆవేదనను సోషల్ మీడియాలో బహిరంగంగానే వ్యక్తం చేశారు. ముఖ్యంగా గౌతమ్ గంభీర్ ను ఉద్దేశించి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఇప్పటికీ గౌతమ్ గంభీర్ ను రోహిత్ అభిమానులు ఏమాత్రం సహించడం లేదు. అతడు కనిపిస్తే చాలు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు.

గౌతమ్ గంభీర్ ఎందుకు రోహిత్ ను పక్కన పెట్టాడు.. జట్టు నుంచి ఎందుకు వెళ్లిపోయేలా చేశాడు.. అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదు.. తను వెళ్లిపోవడానికి అధికారికంగా గౌతమ్ గంభీర్ కారణమని ఇంతవరకు రోహిత్ చెప్పలేదు. అయితే పెద్దల విషయంలో.. తనకు కోచింగ్ ఇచ్చిన వారి విషయంలో రోహిత్ ఎంతో మర్యాదగా ఉంటాడు. ఆ మధ్య తన పేరు మీద ముంబై మైదానంలో స్టాండ్ ఏర్పాటు చేసినప్పుడు.. తనకు శిక్షణ ఇచ్చిన వారిని అభినందించాడు.




ఆ సమావేశంలో వారందరిని తలుచుకున్నాడు. ఇప్పుడు జరుగుతున్న ముంబై t20 లీగ్ లో కూడా రోహిత్ తన శిక్షణ ఇచ్చిన చిన్ననాటి కోచ్ ను ప్రేమను చూపించాడు. అంతేకాదు అతని పాదాల మీద పడి నమస్కరించాడు.

రోహిత్ శర్మకు కు చిన్నతనంలో దినేష్ ల్యాడ్ అనే వ్యక్తి శిక్షణ ఇచ్చాడు. అతడి నేతృత్వంలో రోహిత్ రాటు తేలాడు. అతడు అద్భుతంగా బ్యాటింగ్ చేయడంలో దినేష్ పాత్ర కచ్చితంగా ఉంటుంది. ఇదే విషయాన్ని అనేక సందర్భాలలో రోహిత్ బయటపెట్టాడు. తాజాగా ముంబై t20 లీగ్ చూసేందుకు రోహిత్ వాంఖడే స్టేడియానికి వెళ్ళాడు. స్టేడియం వెళ్తుండగా దినేష్ తన సతీమణితో కనిపించాడు. ఆయనను చూసిన రోహిత్ వెంటనే కాళ్ళ మీద పడి నమస్కరించాడు. అతడిని చూసి ఆనంద పరవశుడయ్యాడు. తన దగ్గర శిక్షణ పొందిన రోహిత్ ఈ స్థాయిలో ఎదగడం పట్ల దినేష్ హర్షం వ్యక్తం చేశాడు.

# ముంబై నుంచి సూర్య ఔట్?

మొత్తానికి ఐపిఎల్ లో ముంబై జట్టు నుంచి సూర్య కుమార్ యాదవ్ వెళ్లిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. అతడు ముంబై ఇండియన్స్ జట్టును ఇన్ స్టా గ్రామ్ లో అన్ ఫాలో చేశాడు. అంత కాదు ముంబై జట్టుతో గతంలో దిగిన ఫోటోలను మొత్తం డిలీట్ చేశాడు.. ఈ నేపథ్యంలో అతడు వచ్చే సీజన్లో ముంబై నుంచి బయటికి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మేనేజ్మెంట్ కూడా అతడి విషయంలో అంత సానుకూలంగా లేనట్టు కనిపిస్తోంది.

సూర్య కుమార్ యాదవ్ ముంబై జట్టు నుంచి బయటికి వస్తే వచ్చే సీజన్లో అతడు ఏ జట్టులో ఆడతాడు.. ఏ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడు.. అనే ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో ఒక వార్త కనిపిస్తోంది. అది ఎంతవరకు నిజమో తెలియదు గాని.. సూర్య కుమార్ యాదవ్ వచ్చే సీజన్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుకు ఆడే అవకాశం ఉందని తెలుస్తోంది. ట్రేడ్ లో భాగంగా సూర్య కుమార్ యాదవ్ బెంగళూరు వెళ్తాడని.. బెంగళూరు నుంచి బెతెల్.. పావెల్ ముంబై జట్టుకు వెళ్ళిపోతారని తెలుస్తోంది. రెండు జట్ల మధ్య ఈ ట్రేడ్ కుదిరిందని.. అధికారికంగా ప్రకటన మాత్రమే మిగిలి ఉందని సోషల్ మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి.

ఇంతవరకు సూర్య కుమార్ యాదవ్ తాను ముంబై జట్టు నుంచి బయటికి వెళ్తున్నట్టు అధికారికంగా ప్రకటించలేదు. ముంబై జట్టు కూడా సూర్యకుమార్ యాదవ్ విషయంలో ఎటువంటి ప్రకటన చేయలేదు. అయితే అతడు ముంబై ఇండియన్స్ జట్టును సోషల్ మీడియాలో అన్ ఫాలో చేయడం రకరకాల ఊహాగానాలకు కారణమవుతోంది.




గతంలో ముంబై జట్టు కూడా హార్దిక్ పాండ్యాను గుజరాత్ నుంచి ట్రేడ్ విధానం లో తీసుకుంది. అయితే ఇప్పుడు అదే విధానాన్ని బెంగళూరు కూడా కొనసాగించే అవకాశం కనిపిస్తుందని తెలుస్తోంది. మరోవైపు బెంగళూరు ప్రతిపాదనకు.. ముంబై ఓకే చెబుతుందా.. ఈ ట్రేడ్ కార్యరూపం దాల్చుతుందా.. చూడాల్సి ఉంది.

సూర్య కుమార్ యాదవ్ ఈ సీజన్లో అంతగా ఆడలేదు. అతడు హార్దిక్ పాండ్యాతో కూడా టచ్ మీ నాట్ అన్నట్టుగానే వ్యవహరించాడు. టీ మీడియాకు టి20 వరల్డ్ కప్ సాధించి పెట్టినప్పటికీ.. వ్యక్తిగత ప్రదర్శన అంత గొప్పగా చేయలేదు. అందువల్లే అతడిని మేనేజ్మెంట్ జాతీయ జట్టు నుంచి పక్కనపెట్టింది. ఆటగాడిగా కూడా అతడిని ఎంపిక చేయలేదు. ఈ నేపథ్యంలో అతడు గనుక మిగతా టోర్నీలలో అవకాశం వస్తే.. తనను తాను నిరూపించుకుంటే.. జట్టులో స్థానం స్థిరంగా ఉంటుందని.. క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.. ప్రస్తుతం జరుగుతున్న ముంబై t20 లో కూడా సూర్యకుమార్ యాదవ్ తన స్థాయిలో ఆడటం లేదు.

### ఆఫ్ఘనిస్తాన్ మీద గెలిచినా..
## టీమిండియాకు అదే దుస్థితి..



ఆఫ్ఘనిస్తాన్ జట్టుతో జరిగిన ఏకైక టెస్టులో టీమిండియా ఇన్నింగ్స్ 300 పరుగుల విజయం సాధించింది.. తద్వారా టీమ్ ఇండియా టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద విజయాన్ని నమోదు చేసింది. టీమిండియా ఈ స్థాయిలో విజయాన్ని అందుకున్నప్పటికీ.. డబ్ల్యూటీసి పాయింట్ల పట్టికలో ఇంకా ఆరవ స్థానంలోనే కొనసాగుతోంది. స్థూలంగా చెప్పాలంటే బంగ్లాదేశ్ కంటే దిగువ స్థానంలో కొనసాగుతోంది.

డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉంది. ఇప్పటివరకు ఎనిమిది మ్యాచ్లు ఆడిన ఆస్ట్రేలియా ఏడు విజయాల సొంతం చేసుకుంది.. ఆ జట్టు ఖాతాలో 84 పాయింట్లు ఉన్నాయి. రెండో స్థానంలో సౌత్ ఆఫ్రికా కొనసాగుతోంది. సౌత్ ఆఫ్రికా ఏకంగా నాలుగు మ్యాచ్లు ఆడి.. మూడు విజయాలు సాధించింది. సౌత్ ఆఫ్రికా ఖాతాలో 75 పాయింట్లు ఉన్నాయి. మూడో స్థానంలో శ్రీలంక కొనసాగుతోంది. శ్రీలంక రెండు మ్యాచ్ లు ఆడి.. ఒక దాంట్లో విజయం సాధించింది. మరొక మ్యాచ్ డ్రా అయింది. శ్రీలంక ఖాతాలో 66.67 పాయింట్లు ఉన్నాయి.

నాలుగో స్థానంలో న్యూజిలాండ్ కొనసాగుతోంది. న్యూజిలాండ్ జట్టు నాలుగు మ్యాచ్లు ఆడి.. రెండు విజయాలు సాధించింది. ఇందులో ఒక మ్యాచ్ ఓడిపోగా.. మరొక మ్యాచ్ డ్రా అయింది.. ఐదవ స్థానంలో బంగ్లాదేశ్ కొనసాగుతోంది. బంగ్లాదేశ్ నాలుగు మ్యాచ్ లు ఆడింది. ఇందులో రెండు విజయాలు.. ఒక ఓటమి.. మరొక డ్రా ఉన్నాయి. ఆరో స్థానంలో ఇండియా కొనసాగుతోంది. ఇండియా ఖాతాలో 48.15 పాయింట్లు ఉన్నాయి.

టీమిండియా తదుపరి శ్రీలంక, న్యూజిలాండ్ జట్లతో సిరీస్ లు ఆడుతుంది.. ఈ సిరీస్లలో టీమిండియా కచ్చితంగా గెలవాలి. స్వదేశంలో న్యూజిలాండ్ జట్టుతో ఎదురైన వైట్ వాష్ పరాభవానికి బదులు తీర్చుకోవాలి. శ్రీలంక జట్టు మీద కూడా ఏకపక్షమైన విజయాన్ని సాధిస్తేనే టీమ్ ఇండియాకు డబ్ల్యూటీసి ఫైనల్ వెళ్లే అవకాశం ఉంటుంది.

గత రెండు పర్యాయాలు టీమిండియా డబ్ల్యూటీసి ఫైనల్ వెళ్ళింది. ఫైనల్ లో ఒకసారి న్యూజిలాండ్.. మరొకసారి ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. గత సీజన్లో టీం ఇండియా అంతగా ఆకట్టుకోలేదు. అందువల్ల డబ్ల్యూటీసీ ఫైనల్ వెళ్లలేకపోయింది. అయితే ఈసారి న్యూజిలాండ్, శ్రీలంక జట్లతో జరిగే సిరీస్లలో విజయాలు సాధించి.. డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకోవాలని భావిస్తోంది. ఆ తర్వాత ఆస్ట్రేలియా జట్టుతో జరిగే సిరీస్లో అదరగొడితే టీమ్ ఇండియాకు ఇక ఎదురు ఉండదు.

| POS | TEAM | PLAYED | WON | LOST |
|---|---|---|---|---|
| 1 | AUSTRALIA | 8 | 7 | 1 |
| 2 | SOUTH AFRICA | 4 | 3 | 1 |
| 3 | SRI LANKA | 2 | 1 | 0 |
| 4 | NEW ZEALAND | 4 | 2 | 1 |
| 5 | BANGLADESH | 4 | 2 | 1 |
| 6 | INDIA | 9 | 4 | 4 |
| 7 | ENGLAND | 11 | 4 | 6 |
| 8 | PAKISTAN | 4 | 1 | 3 |
| 9 | WEST INDIES | 8 | 0 | 7 |

# శ్రేయాస్ అయ్యర్ అవసరమొచ్చింది..

**- నిరూపించుకోవాల్సిన టైం వచ్చింది..**
**- నిలబడితే టీమిండియా భీకరం**

ఇది చాలా సంవత్సరాలుగా అనుకుంటున్న మాటే. కానీ అది వాస్తవ రూపం దాల్చలేదు. పైగా అతనికి జట్టులో స్థానం కూడా స్థిరంగా లేదు. దీంతో అతడి గురించి రకరకాల విమర్శలు.. ఆరోపణలు వచ్చాయి. వీటన్నిటిని తట్టుకుంటూ ఇప్పుడు అతడు అనుకున్న స్థానానికి చేరుకున్నాడు. విమర్శకుల నోటికి సరైన విధంగా తాళం వేశాడు. అతడు మరెవరు కాదు శ్రేయస్ అయ్యర్.

డొమెస్టిక్ క్రికెట్ లో అయ్యర్ అద్భుతమైన ప్రతిభ చూపించాడు. అనేక సందర్భాలలో అతనికి నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తారని చర్చ జరిగినప్పటికీ అది సాధ్యం కాలేదు. అంతేకాదు అతడికి జట్టులో స్థానం కూడా స్థిరంగా లేకుండా పోయింది.. కొన్ని సందర్భాలలో t20.. టెస్ట్ జట్లలో అతడికి అవకాశం కూడా లభించలేదు. ఇన్ని సంవత్సరాల తర్వాత అతడికి అనుకున్న సమయం వచ్చింది. టీమ్ ఇండియా టి20 సారథిగా అతడికి అవకాశం లభించింది.

కొంతకాలంగా ఐపీఎల్లో అదరగొడుతున్నాడు.. ఉదాహరణకు గత మూడు సీజన్లను పరిశీలనలోకి తీసుకుంటే.. 2024 లో కోల్కతా జట్టును అతడు విజేతగా నిలిపాడు. 2014 తర్వాత కోల్కతా మళ్లీ ఛాంపియన్ అవడం వెనక అయ్యర్ కృషి అమోఘం. 2025లో పంజాబ్




జట్టు సారథి అయ్యాడు. ఆ జట్టును ఆ సీజన్లో ఫైనల్ దాకా తీసుకెళ్లాడు. దీనికంటే ముందు 2020లో ఢిల్లీ జట్టును ఐపీఎల్లో ఫైనల్ దాకా తీసుకెళ్లాడు. మూడు భిన్నమైన జట్లను ఐపీఎల్లో ఫైనల్ దాకా తీసుకెళ్లిన చరిత్ర అయ్యర్ కు ఉంది.సారథిగా మాత్రమే కాదు ఆటగాడిగా కూడా అతడు స్థిరమైన ప్రదర్శన చేస్తున్నాడు. గత ఐపిఎల్ సీజన్లో 17 మ్యాచులు ఆడి 604 పరుగులు చేశాడు. ఈ సీజన్లో 14 మ్యాచ్లలో 498 పరుగులు చేశాడు. ఇక జాతీయ జట్టులో అయ్యర్ స్థిరంగా స్థానాన్ని కొనసాగించలేకపోయాడు. గాయాల వల్ల ఇబ్బంది పడ్డాడు. టెస్ట్.. టి20 లలో ఆడినప్పటికీ తన స్థాయి ప్రదర్శన చేయలేకపోయాడు. అయితే ఐపీఎల్ లో అయ్యర్ అద్భుతమైన ప్రదర్శన చేసిన తర్వాత అతడిని సారథిగా తీసుకోవాలని డిమాండ్లు పెరిగిపోయాయి.

అయ్యర్ తో అంతకుముందు ద్రావిడ్.. ఇప్పుడు గంభీర్ కు చెప్పుకునే స్థాయిలో సంబంధాలు లేకపోయినప్పటికీ.. అభిమానుల నుంచి డిమాండ్ రావడంతో.. మేనేజ్మెంట్ అతడికి కెప్టెన్సీ స్థానం కట్టబెట్టాల్సి వచ్చింది. వచ్చే ఐర్లాండ్.. ఇంగ్లాండ్ సిరీస్లలో టీమిండియాకు నాయకత్వం వహించబోతున్నాడు. ఆ సిరీస్లలో అతను చూపించిన ప్రదర్శన ఆధారంగానే.. కెప్టెన్సీ స్థానం ఆధారపడి ఉంటుందని క్రికెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

## వానాకాలం జాగ్రత్తలు

తాగునీరు, ఆహారం విషయంలో జాగ్రత్త. కలుషిత నీటి వల్ల డయేరియా, కలరా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే ఎల్లప్పుడూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి మరియు వీలైనంత వరకు వేడివేడి, తాజా ఇంట్లో వండిన ఆహారాన్నే తీసుకోవాలి.



# 100 కథలను రిజెక్ట్ చేసిన మెగా హీరో

**ముద్ర డెస్క్ :** మెగా ఫ్యామిలీ నుండి ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టిన ప్రతీ హీరో బాక్స్ ఆఫీస్ వద్ద భారీ విజయాలను అందుకొని , ఇండస్ట్రీ లో మంచి స్థానం లో కొనసాగుతున్నారు. ఒక్క అల్లు శిరీష్ మాత్రమే ఇండస్ట్రీ లో సక్సెస్ సాధించలేకపోయారు. చివరికి 'ఉప్పెన' తో ఇండస్ట్రీ లోకి గ్రాండ్ గా సాయి ధరమ్ తేజ్ సోదరుడు పంజా వైష్ణవ్ తేజ్ కూడా బంపర్ హిట్ కొట్టాడు. ఆయన మొదటి చిత్రం 'ఉప్పెన' ఏ రేంజ్ బ్లాక్ బస్టర్ అనేది ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. దాదాపుగా 120 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు , 60 కోట్ల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయి.

అలాంటి సెన్సేషనల్ సినిమా తర్వాత వైష్ణవ్ తేజ్ కెరీర్ రాబోయే రోజుల్లో పీక్ రేంజ్ కి వెళ్ళిపోతుందని అంతా అనుకున్నారు. కానీ తీరా చూస్తే వరుస డిజాస్టర్ ఫ్లాప్స్ ని అందుకొని , దిక్కులేని స్థితికి వెళ్ళిపోయాడు. ఈయనతో పాటు ఇండస్ట్రీ లోకి వచ్చిన హీరోలు , ఈయన తర్వాత ఇండస్ట్రీ లోకి వచ్చిన హీరోలు కూడా వరుస విజయాలను అందుకుంటూ మార్కెట్ లో తమకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కానీ వైష్ణవ్ తేజ్ కి అలాంటి పరిస్థితి లేదు. 'ఉప్పెన' తర్వాత ఆయన హీరో గా నటించిన 'రంగ రంగ వైభవంగా', 'కొండపోలం', 'ఆదికేశవ' వంటి సినిమాలు ఘోరమైన డిజాస్టర్ ఫ్లాప్స్ గా నిలిచాయి.


ఈ సినిమాలు ఎప్పుడు విడుదలైందో , ఎప్పుడు థియేటర్స్ నుండి వెళ్లిపోయిందో కూడా ఆడియన్స్ కి తెలీదు , కనీసం మెగా హీరోలు కూడా ఈ చిత్రాన్ని థియేటర్స్ లో చూడలేదు. అలాంటి సినిమాలు చేశాడు. ఆయన చివరి చిత్రం 'ఆదికేశవ' 2023 వ సంవత్సరం లో విడుదలైంది. అంటే దాదాపుగా మూడేళ్లు కావొస్తుంది. ఇప్పటి వరకు ఒక్క సినిమా కూడా విడుదల చేయకపోవడం తో వైష్ణవ్ తేజ్ సినిమాలను ఆపేశాడా అనే అనుమానం అందరిలో కలిగింది.



కానీ ఆయన ఈ మోడీల్లాలో సరైన కథ కోసం ఎదురు చూస్తున్నాడట. దాదాపుగా ఆయన 100 కథలను ఈ మూడేళ్ళలో రిజెక్ట్ చేసినట్టు తెలుస్తోంది. ఈసారి కొడితే 'ఉప్పెన' ని మించిన హిట్ కొట్టాలని పంజా వైష్ణవ్ తేజ్ ఫిక్స్ అయ్యాడు. అందుకే కథ ఎంపిక విషయం లో ఇంతటి జాప్యం జరిగింది. ఎట్టకేలకు రీసెంట్ గానే ఆయన ఒక కథ కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది.

యంగ్ డైరెక్టర్ మహేష్ రీసెంట్ గానే వైష్ణవ్ తేజ్ ని కలిసి ఒక కథ వినిపించాడట. ఈ కథ వైష్ణవ్ తేజ్ కి పిచ్చి పిచ్చిగా నచ్చినట్టు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్టైన్మెంట్స్ సంస్థ గ్రాండ్ గా భారీ బడ్జెట్ తో నిర్మించనుంది. ఈ ఏడాది లోనే ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ మొదలయ్యే అవకాశాలు ఉన్నాయి.

## లీకైన హీరోయిన్ జాన్వీ కపూర్ ప్రైవేట్ చాట్స్..



భారీ అంచనాల నడుమ విడుదలైన గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' బంపర్ హిట్ అయ్యింది. ఎక్కడ చూసినా ఆడియన్స్ ఈ సినిమాలోని రామ్ చరణ్ అద్భుతమైన నటన గురించే మాట్లాడుకుంటున్నారు. ఆయనకు నేషనల్ అవార్డు వస్తుందని పొగడ్తలతో ముంచి ఎత్తుతున్నారు. రామ్ చరణ్ క్యారెక్టర్ తర్వాత ఈ సినిమాలో హీరోయిన్ గా నటించిన జాన్వీ కపూర్ గురించే ఆడియన్స్ ఎక్కువగా మాట్లాడుకుంటున్నారు. పాజిటివ్ గా కాదు , నెగెటివ్ గా.. ఒక హీరోయిన్ పాత్ర పై ఈ రేంజ్ నెగెటివిటీ ఈ మధ్య కాలం లో ఈ సినిమాకు చూసినంతగా , ఏ సినిమాకు కూడా చూడలేదు అనడం లో ఎలాంటి అతిశయోక్తి లేదు. అంత చెత్తగా ఆ పాత్రని డిజైన్ చేశాడు డైరెక్టర్ బుచ్చి బాబు. జాన్వీ కపూర్ అందాలను చూపిస్తూ , ఆమెని హీరోయిన్ కంటే వ్యాంప్ అనే విధంగా ఆడియన్స్ కి అర్థం అయ్యేలా చేసాడు. డైరెక్టర్ బుచ్చి బాబు పై ఈ విషయం లో సోషల్ మీడియా లో ఎలాంటి నెగెటివిటీ ఏర్పడిందో , జాన్వీ కపూర్ కి కూడా అదే రేంజ్ నెగెటివిటీ ఏర్పడింది. ఈమెని తిట్టని వాళ్లంటూ ఎవ్వరు లేరంటే అతిశయోక్తి లేదేమో. అయితే సోషల్ మీడియా లో నెటిజెన్స్ చేసే కామెంట్స్ గురించి కాసేపు పక్కన పెడితే, సినీ సెలబ్రిటీల నుండి మాత్రం ఆమెకు మంచి సపోర్టు వస్తోంది. ఇప్పటి వరకు యాంకర్ అనసూయ , హీరోయిన్ ఆశికా రంగనాథ్, జగపతి బాబు , కంగనా రనౌత్ వంటి వారు ఈ అంశంపై స్పందించారు. ఇలాంటి నేపథ్యం లో జాన్వీ కపూర్ కి సంబంధించిన ఒక ప్రైవేట్ చాట్ సోషల్ మీడియా లో లీకై బాగా వైరల్ అయ్యింది. ఈ ప్రైవేట్ చాట్ లో ఆమె ఒక వ్యక్తితో మాట్లాడిన మాటలు , సంచలనంగా మారాయి. ఆమె మాట్లాడుతూ 'డైరెక్టర్ కి ఈ స్థాయి అందాల ఆరబోత నాకు ఇష్టం లేదని చెప్పాను , కానీ ఆయన వినిపించుకోలేదు. రామ్ చరణ్ గారు కూడా నా ఇబ్బందిని గమనించి , డైరెక్టర్ కి అలాంటి సీన్స్ తీయొద్దని చెప్పాడు , అయినప్పటికీ డైరెక్టర్ తగ్గలేదు. నాకు రామ్ చరణ్ షూటింగ్ మొదలైన రోజు నుండి , ఎండింగ్ వరకు చాలా సపోర్ట్ గా నిలుస్తూ వచ్చాడు. ఆయనతో పని చేయడం ఒక గొప్ప అనుభూతి. నేను ఇండస్ట్రీ లో పని చేసిన వారిలో ది బెస్ట్ ఎవరైనా ఉన్నారా అంటే అది రామ్ చరణ్ మాత్రమే' అంటూ ఆమె ఆ ప్రైవేట్ చాట్ లో మాట్లాడిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాయి.

### బాలకృష్ణ - కొరటాల శివ మూవీలో

# విలన్ గా టాప్ హీరో..

ప్రస్తుతం సీనియర్ హీరోల్లో నందమూరి బాలకృష్ణ ఊపు ఏ రేంజ్ లో ఉందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. 'అఖండ' నుండి 'డాకు మహారాజ్' చిత్రం వరకు వరుస బ్లాక్ బస్టర్స్ తో అభిమానులను ఆనందంతో ఉక్కిరిబిక్కిరి చేసిన ఈ నందమూరి సింహం , రీసెంట్ గా 'అఖండ 2' తో కాస్త తడబడిన సంగతి అందరికీ తెలిసిందే. భారీ అంచనాల నడుమ విడుదలైన ఈ చిత్రం కమర్షియల్ గా పెద్ద డిజాస్టర్ ఫ్లాప్ గా మిగిలింది. ఈ రేంజ్ ఫ్లాప్ అవుతుందని అభిమానులు కూడా ఊహించలేకపోయారు. ఈ సినిమా తర్వాత బాలయ్య స్క్రిప్ట్ సెలక్షన్ విషయం లో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. ప్రస్తుతానికి ఆయన గోపీచంద్ మలినేని దర్శకత్వం లో ఒక సినిమా చేస్తున్నాడు. రీసెంట్ గానే షూటింగ్ కార్యక్రమాలను మొదలుపెట్టుకున్న ఈ చిత్రంలో మంచు మనోజ్ విలన్ గా నటిస్తున్నాడు.

తమన్ సంగీతం అందిస్తుండగా , ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ ని త్వరలోనే విడుదల చేయబోతున్నారు మేకర్స్. ఈ సినిమా సంగతి పక్కన పెడితే రీసెంట్ గానే బాలయ్య బాబు కొరటాల శివ దర్శకత్వం లో ఒక సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకు అనిరుద్ మ్యూజిక్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నాడు. త్వరలోనే షూటింగ్ మొదలు పెట్టుకోనున్న ఈ సినిమాకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయం ఇప్పుడు సోషల్ మీడియా లో హాట్ టాపిక్ గా మారింది. ఈ చిత్రం లో విలన్ గా నటించబోతున్నది మరెవరో కాదు , సీనియర్ హీరో రాజశేఖర్. ఒకప్పుడు రాజశేఖర్ కి ఎలాంటి క్రేజ్ ఉండేదో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. బాలకృష్ణ తో సమానమైన క్రేజ్ , ఫాలోయింగ్ ఉండేది. కానీ మధ్యలో వరుస ఫ్లాప్స్ కారణంగా ఆయన మార్కెట్ బాగా దెబ్బ తినింది.

అయినప్పటికీ హీరో గా కొన్ని సినిమాలు చేసాడు రాజశేఖర్, అవి కూడా పెద్దగా వర్కౌట్ అవ్వలేదు , దీంతో క్యారెక్టర్ రోల్స్ , విలన్ రోల్స్ చేయడానికి ఆయన సిద్ధమయ్యాడు. అందులో భాగంగానే ఆయన ఈ ఏడాది 'బైకర్' చిత్రం లో నటించాడు. ఇందులో శర్వానంద్ కి తండ్రి పాత్రలో , పాజిటివ్ క్యారెక్టర్ లో బలమైన ఎమోషన్స్ పండించాడు. ఈ చిత్రం తర్వాత ఆయన విజయ్ దేవరకొండ హీరో గా నటిస్తున్న 'రౌడీ జనార్దన' అనే చిత్రం లో పవర్ ఫుల్ విలన్ క్యారెక్టర్ చేయడానికి ఒప్పుకున్నాడు. ఇప్పుడు లేటెస్ట్ గా ఆయన బాలయ్య , కొరటాల శివ కాంబినేషన్ లో విలన్ గా నటించబోతున్నాడు. ఒకప్పుడు బాలయ్య తో సమానంగా వసూళ్లను రాబడుతూ టాప్ 5 హీరోలలో ఒకరిగా కొనసాగిన రాజశేఖర్ , ఇప్పుడు అదే బాలయ్య సినిమాలో విలన్ గా నటించబోతుండడం గమనార్హం. చూడాలి మరి ఈ కాంబినేషన్ బాక్స్ ఆఫీస్ వద్ద ఎలాంటి అద్భుతాలు సృష్టించబోతోంది అనేది.



# కుటుంబమే బన్నీకి ఫస్ట్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఎంత పెద్ద స్టార్ అయినా, ఎంత బిజీ షెడ్యూల్‌లో ఉన్నా ఫ్యామిలీకి ఇచ్చే ప్రాధాన్యత మాత్రం ఎప్పుడూ తగ్గదని మరోసారి నిరూపించారు. వరుస పాన్ ఇండియా ప్రాజెక్టులు, భారీ సినిమాల షూటింగ్‌లతో తీరికలేని రోజులు గడుపుతున్న బన్నీ, దొరికిన ప్రతి ఖాళీ సమయాన్ని కుటుంబ సభ్యులతో గడపడానికి కేటాయిస్తుంటారు. గతంలో కూడా తన భార్య స్నేహారెడ్డి, పిల్లలు అర్హ, అయాన్‌లతో కలిసి గడిపిన అనేక మధుర క్షణాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్న ఆయన, తాజాగా మరోసారి కుటుంబంతో కలిసి కనిపించి అభిమానులను ఆకట్టుకున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక ఫోటో బన్నీ ఫ్యామిలీ బాండింగ్‌కు అద్దం పడుతోంది. వైరల్ అవుతున్న ఈ ఫోటోలో అల్లు అర్జున్ తన కూతురు అర్హను ఎత్తుకుని ఎంతో ఆనందంగా కనిపిస్తున్నారు. అక్కడే బన్నీ భార్య స్నేహారెడ్డి కింద కూర్చుని ఉండగా, ఫ్యామిలీతో కలిసి ఆ క్షణాన్ని ఆస్వాదిస్తున్న దృశ్యం అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. అదే ఫోటోలో అల్లు శిరీష్, నయనిక కూడా కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ ఫోటోలో ఎక్కడా సినీ స్టార్ ఇమేజ్ కనిపించకుండా, సాధారణ కుటుంబ సభ్యుడిగా బన్నీ కనిపించడం అభిమానులను మరింత ఆకట్టుకుంటోంది. సోషల్ మీడియాలో ఈ ఫోటోకు ఇప్పటికే వేలాది లైక్‌లు, కామెంట్లు వచ్చాయి. స్టార్‌డమ్ ఎంత పెరిగినా ఫ్యామిలీకి ఇచ్చే విలువ మారలేదు.. ఇదే బన్నీని ప్రత్యేకంగా నిలబెడుతుందంటూ అభిమానులు ఆ ఫోటో కింద కామెంట్స్ చేస్తూ దాన్ని నెట్టింట వైరల్ చేస్తున్నారు. సినీ సెలబ్రిటీల వ్యక్తిగత జీవితంపై ఎప్పుడూ ఆసక్తి చూపే ప్రేక్షకులకు ఇలాంటి కుటుంబ క్షణాలు మరింత దగ్గర చేస్తాయని చెప్పాలి. అల్లు అర్జున్ వ్యక్తిత్వంలో కుటుంబానికి ఉన్న స్థానం గురించి ఇండస్ట్రీ వర్గాలు కూడా తరచూ మాట్లాడుతుంటాయి. షూటింగ్‌ల మధ్యలో సమయం దొరికినా, విదేశీ పర్యటనల్లో ఉన్నా కుటుంబంతో గడిపే క్షణాలకు ఆయన ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారని చెబుతారు. అందుకే ఆయన సోషల్ మీడియా ఖాతాల్లో కూడా సినిమాల కంటే కుటుంబానికి సంబంధించిన పోస్టులు తరచూ కనిపిస్తుంటాయి. ముఖ్యంగా తన పిల్లలతో గడిపే సరదా క్షణాలు అభిమానులను ఎప్పుడూ ఆకట్టుకుంటాయి. ఇక సినిమాల విషయానికి వస్తే, ప్రస్తుతం అల్లు అర్జున్, డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ రాకాలో నటిస్తున్నారు. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. పుష్ప సిరీస్‌తో జాతీయ స్థాయిలో తన మార్కెట్‌ను విస్తరించుకున్న బన్నీ, ఇప్పుడు ఈ సినిమాతో మరింత పెద్ద స్థాయిని టార్గెట్ గా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అట్లీ – అల్లు అర్జున్ కాంబినేషన్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఒకవైపు కెరీర్‌లో కొత్త శిఖరాలను అధిరోహిస్తూనే, మరోవైపు ఫ్యామిలీతో మధుర క్షణాలను ఆస్వాదిస్తున్న అల్లు అర్జున్ ప్రస్తుతం అభిమానులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. అందుకే ఆయన ఫ్యామిలీ ఫోటోలు కూడా సినిమాల అప్డేట్లంతే వేగంగా వైరల్ అవుతున్నాయి.



# ఓటీటీ లోకి సూర్య 'కరుప్పు' చిత్రం.. ఎందులో చూడాలంటే..

ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై , బాక్స్ ఆఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ టాక్ ని కైవసం చేసుకొని , సునామీ లాంటి థియేట్రికల్ రన్ ని సొంతం చేసుకున్న చిత్రం 'కరుప్పు'. చాలా కాలం నుండి సరైన బ్లాక్ బస్టర్ హిట్ లేక ఇబ్బంది పడుతున్న సూర్య కు , ఈ సినిమా ఇచ్చిన కిక్ మామూలుది కాదు. ఒక్కసారిగా ఆయన దిక్కుతోచని తమిళ సినిమా ఇండస్ట్రీ కి ఈ సినిమాతో గాడ్ ఫాదర్ లాగా మారిపోయాడు. సినిమా విడుదలై మూడు వారాలు పూర్తి అయ్యింది. కానీ ఇప్పటికీ కూడా ఈ చిత్రానికి మంచి వసూళ్లు నమోదు అవుతూనే ఉన్నాయి. వీకెండ్ లో డీసెంట్ స్థాయి ఆక్యుపెన్సీలను నమోదు చేసుకుంటూ , బయ్యర్స్ కి లాభాలు కురిపిస్తూనే ఉంది ఈ చిత్రం. గడిచిన 24 గంటల్లో ఈ సినిమాకు 10 వేలకు పైగా టిక్కెట్లు అమ్ముడుపోయాయి.

ఇదంతా పక్కన పెడితే ఈ సినిమా ఓటీటీ గురించి వచ్చిన ఒక లేటెస్ట్ అప్డేట్ ఇప్పుడు సంచలనంగా మారింది. అమెజాన్ ప్రైమ్ వీడియో సంస్థ ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ రైట్స్ ని కొనుగోలు చేసింది. వాళ్ళతో మేకర్స్ కుదిరించుకున్న ఒప్పందం ప్రకారం నాలుగు వారాల తర్వాత ఓటీటీ లో స్ట్రీమింగ్ చెయ్యాలి. అందుకే ఈ నెల 12 న ఈ సినిమాని అమెజాన్ ప్రైమ్ వీడియో లో తెలుగు , తమిళం , హిందీ మరియు మలయాళం వెర్షన్స్ లో ఒకేసారి స్ట్రీమింగ్ చేయబోతున్నారు. థియేటర్స్ లో బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ ని సొంతం చేసుకున్న ఈ చిత్రానికి , ఓటీటీ ఆడియన్స్ నుండి ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో చూడాలి. 'కరుప్పు' చిత్రానికి పాజిటివ్ టాక్ తో పాటుగా , నెగెటివ్ టాక్ కూడా సమాంతరంగా వచ్చింది.

కానీ తమిళం లో ఆరు నెలల నుండి సరైన బ్లాక్ బస్టర్ హిట్ లేకపోవడం, ఆడియన్స్ కరువులో ఉండడం వల్ల , ఈ సినిమాని ఎగబడి చూసారు అనేది కొందరి వాదన. అందులో ఎంత మాత్రం నిజముంది అనేది , ఓటీటీ రిలీజ్ తో తేలిపోనుంది. చాలా సూపర్ హిట్ సినిమాలకు థియేటర్స్ లో వచ్చినంత రెస్పాన్స్ ఈమధ్య కాలం లో ఓటీటీ లో రావడం లేదు , అదే సమయం లో కొన్ని ఫ్లాప్ సినిమాలకు ఓటీటీ లో బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ వస్తుంది. ఈ సినిమాకు ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో చూడాలి. ఈ చిత్రం తర్వాత సూర్య 'లక్కీ భాస్కర్' డైరెక్టర్ వెంకీ అట్లూరి తో 'విశ్వనాథ్ & సన్స్ ' అనే చిత్రం చేస్తున్నాడు. 'కరుప్పు' కారణంగా ఈ చిత్రానికి అటు తమిళం లో ఎంత డిమాండ్ పెరిగిందో , తెలుగులో కూడా అదే రేంజ్ డిమాండ్ పెరిగింది.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413 . email: mudradaily@gmail.com